PRAMUKHANDHRA 26th Year of Publication We carry the news and views of Telugus

26 వ సంవత్సరం

# ప్రముఖాంధ్ర



వ్యవస్థాపకులు
శ్రీ గోటేటి శ్రీరామారావు

₹.15
సెప్టెంబర్ 2020

THE ONE AND ONLY TELUGU MAGAZINE CIRCULATED IN USA, UK, CANADA,
GERMANY, AUSTRALIA, MAURITIUS, SOUTH AFRICA, UAE, KUWAIT, SINGAPORE, MALAYSIA & ALL OVER INDIA






*Budget ❖ Plan ❖ Design ❖ Arrange ❖ Manage Weddings*

# Shubhavivaaham

**Complete Solutions for a Grand Wedding**

Wedding is a Grand, Joyous and Life time occassion. While you are busy managing your loved ones and are busy with rituals, please allow trusted, experienced Wedding Planners, like us, to organize the event in the most memorable way for you.

***Our services ....***

- ***Wedding Planners***
- ***Catering Services***
- ***Event Organising***
- ***Video & Photography***
- ***Bride & Groom makeover***
- ***Gifting Solutions***
- ***Personalized Assistance***

***&***

- ***Matrimonial Services***
- ***Plan / Arrange / Manage***

#64, Thambaiah Reddi Street, West Mambalam, Chennai 600 033, Tamil Nadu, India. Tel : **+91-44-24742091**
Mob : **+91-98400 48941** ❖ **shubham.vivaaham@gmail.com** ❖ Free Registration at : **www.shubhavivaaham.com**



# ప్రముఖాంధ్ర

ప్రపంచ తెలుగుల మానస పత్రిక

సెప్టెంబరు 2020

సంపుటి : 26 (308) సంచిక : 9



## ఓర్మికి స్వాతంత్ర్యం వచ్చింది

భూమికి భారమై బ్రతకకూడదనే ఆనాటి పెద్దలు, భూమే భారం మోసేటప్పుడు, నాకేవి భారముంటుంది – ఉండదు అనుకుంటూ కలియుగంలోని కొందరు బాధ్యతారహితులై బ్రతుకుతున్నారు. అసలు భూమి ఎలాంటి భారం మోస్తున్నదనే విషయం ఎవరికైనా తెలుసునా–

**దాసకళా కలాప సముదంచిత సార వివేక సంపదన్**
**మానిత యాచమాన జన మానస వృత్త్యభిపూర్తి బుద్ధియె**
**వ్వానికి లేదొకింతయును వాడొకండు భారంబు ధాత్రికిం**
**గానలు గావు శైలముల్ గావు పయోధులు గావు భారముల్ –**

– యని భూదేవి భరించెడి భారాన్ని అన్నింటినీ పూసగ్రుచ్చినట్టు ఓ పద్యంలో వివరించి చెప్పారు శ్రీనాథ కవి సార్వభౌముడు తన 'శృంగార నైషధం' కావ్యంలో –


భూదేవి సర్వభారం వహిస్తుందట – యెలాగంటే ఎన్నో మహారణ్యాలను, ఎన్నో మహాపర్వతాల్ను ఎన్నో మహా సముద్రాలను, ఎన్నెన్నో అంతస్థుల మహాభవంతుల్నూ, పురుగులు పుట్రా, చీమా చిట్రా, చెట్టూ, కొమ్మా, మ్రానూ మాకూ వీటన్నిటినీ ఆమె అవలీలగా మోస్తూనే ఉంది, అయిననూ భారంగా భావించడం లేదట. అయితే దానం, ధర్మం, నీతీ, నియమం ఎఱుంగని శ్రీమంతులైన మనుష్యుల్ని మోయడంలోనే 'భూమి భారం'గా తలపోస్తుందట.

కొద్దోగొప్పో దానం చేస్తాడేమోనని దాన స్వీకరణకొచ్చిన వారు ఆ ధనవంతుణ్ణి ఇంద్రునితోనూ, చంద్రునితోనూ, కర్ణునితోనూ పోల్చుతూ ప్రశంసించుతారట. ఆ ప్రశంసలకు వాడు ఉబ్బి తబ్బిబ్బుబు కాడు, చెవిటి వానివలె వర్తిస్తాడట వాడింకా చేటు అంటారు పెద్దలు. అందుకే 'భూమికి భారం గాకురా' అంటూ మందలిస్తుంటారు.

భూమిని జూచి, భూమి ఓర్మిని చూచీ, సద్గుణ రాశియైన మానవుడు దానశీలతనూ, త్యాగశీలతనూ, ఓర్మినీ ఎంతో నేర్చుకోవాల్సి ఉంది. అందుకేనేమో, భారతదేశంలోని చాలామంది ప్రజలు ముఖ్యంగా మధ్యతరగతి (Middle Class) ప్రజలు, కొండ విరిగి మీద పడ్తున్నప్పటికినీ నోరు మెదపకుండా, శాంతి సహనాలతో కాలక్షేపం చేస్తుంటారు.

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 48 సంవత్సరాలు పూర్తియైనప్పటికినీ, మధ్యతరగతి ప్రజల్లోని చీకటి తెరలు చెరిగిపోలేదు. నిజంగా వారు స్వాతంత్ర్యాన్ని అనుభవించడం లేదు. అయితే దేశంలోని బడా వ్యాపారస్థులు, బడా నాయకులు (పొజిషన్స్ అపొజిషన్స్ వారు సహితమూ) స్వాతంత్ర్యాన్ని అనుభవిస్తున్నారు. నీతుల్ని తమ కథాచిత్రాల్లో (వారిలో నీతి లేకున్నప్పటికినీ) చెప్పే సినిమావారు స్వాతంత్రం జుర్రుకుంటున్నారు. ఎందునూ గాకుండా పోతున్న మధ్యతరగతి ప్రజలు అస్సలు స్వాతంత్రం లేకుండా బ్రతుకుతున్నారు. ఈ 48 సంవత్సరాలుగా ఏ పార్టీ, ఏ నాయకులూ వీరిని గూర్చి పట్టించుకో లేదు, ఒక్క ఓట్ల విషయంలో తప్ప –

ఇహ పోతే భాషా రాష్ట్రాలు వచ్చిన తరువాత – భాషాద్వేషాలూ, నీటి తగాదాలూ, నోటి తగాదాలూ పెరిగిపోయాయి. ఈ తగవులాటలో సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న మైనారిటీ భాషల వారు మేజర్ ట్రబుల్స్ పొందుతున్నారు. ముఖ్యంగా తెలుగువారీ యిబ్బందులకు గురియవుతున్నట్టు పెక్కు లెక్కలు తెలుపుతున్నప్పటికినీ నిమ్మకు నీరెత్తినట్టు ఎవరూ ఏవీ మాట్లాడడం లేదు. ఆంధ్రప్రదేశం నుంచీ మంత్రులు వచ్చినప్పుడల్లా మహజర్లూ ఇవ్వడం, వారు మడచి తమ జేబుల్లో ఉంచుకోవడమే తప్ప, ఒకింత మేలు తల పెట్టడంలేదు. అత్తగారి మాటల్లా – గత మంత్రులు చేయక పోవడం మాకు బాధగా ఉంది. ఉండండి, పరిశీలిస్తాం – అంటూనే వాళ్లూ కాగితాల్ని జేబుల్లోనే పెట్టుకొంటున్నారు. భూదేవి వంటి ఈ ఓర్పు 'శతాయుష్మాన్ భవా' అంటూ ఇలాగే కొనసాగుతుందనుకోవాలేమో?



*బుధజన విధేయుడు*
*– గోటేటి శ్రీరామారావు*
**(సెప్టెంబరు 1995, ప్రముఖాంధ్ర)**

Founder Editor : **GOTETI SRI RAMA RAO**, Editor : **GOTETI VENKATESWARA RAO**
Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor
at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**



# దేవీ శరన్నవరాత్రుల విశిష్టత

శుద్ధ చైతన్య స్వరూపిణి, చింతామణి గృహ వాసిని అయిన ఆ ఆదిపరాశక్తి సృష్టి, స్థితి, లయకారిణి. తన చల్లని చూపులనే వెన్నెలతో, భక్తుల బాధలను తీర్చి, కరుణించే, అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకి అమ్మ. ఆది దేవి అయిన ఆ దుర్గా భావాన్ని మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి రూపాల్లో పూజింపబడే ముగ్గురమ్మల మూలపుటమ్మ. ఆ మహాశక్తి మొదటగా పంచప్రకృతి రూపాలను ధరించింది. ఈ పంచ ప్రకృతులలో ఆది ప్రకృతి శ్రీ దుర్గా దేవి. ఈమెకే పూర్ణ ప్రకృతి అని పేరు.

సకల దేవీ దేవతల శక్తి స్వరూపమే దుర్గాదేవి. 'దుఖేన గమయతే ఇతి దుర్గ'.... అంటే సులభంగా తెలుసుకొనుటకు, సమీపించుటకు సాధ్యం కానిది అని అర్థం. ఈమె ముగ్గురమ్మల మూలపుటమ్మ. సమస్త దేవతల సారం కావడంతో ఈమె దుర్లభమే. కాని, భక్తితో ఆరాధించే వారికి ఈమె సులభమే, దయామూర్తియే. దేవి సౌమ్యరూపాన్ని, రౌద్ర రూపాన్ని రెంటినీ తనలో కలిగి, భక్తులకు అభయాన్ని ప్రసాదిస్తుంది. మనలో ఉన్న అరిషడ్వర్గాలనే అసురీ శక్తులను నిర్జించాలంటే, అమ్మ అనుగ్రహం కావాలి. అనాదిగా వస్తున్న దేవీదేవతల ఉపాసనలు – మనస్సును జయించడానికి సాధకులు ఎంచుకున్న మార్గాలే!

దశ రాత్రులు చేసే ఉత్సవం కనుక దీనికి దశరాత్రోత్సవమని పేరు వచ్చింది. దీనినే 'దసరా' గా వ్యవహరిస్తారు. శరత్ కాలంలో వచ్చే నవరాత్రులు కనుక, శరన్నవరాత్రులుగా పరిగణించబడుతుంది.

మార్కండేయ పురాణం లోని 'దుర్గ సప్తశతి' పన్నెండొవ అధ్యాయము, పన్నెండవ శ్లోకంలో, శుంభ నిశుంభాసురుల సంహారం తరువాత, తనను స్తుతించిన దేవతలతో, మహాదేవి ఇలా చెబుతుంది.

**శరత్కాలే మహాపూజా క్రియతే యాచవార్షికీ ।**
**తస్యాం మమైతన్మాహాత్మ్యం శ్రుత్వా భక్తి సమన్వితః ॥**

భావం: ప్రతి సంవత్సరం వచ్చే శరత్కాలంలో దేవీ నవ రాత్రుల్లో, మహా పూజ చేసేవారు, నా మాహాత్మ్యాన్ని భక్తితో వినేవారు, నా అనుగ్రహం వల్ల అన్ని విధాలయిన కష్టాల నుంచి, విముక్తి పొంది, పుత్ర లాభాలని నిస్సంశయంగా పొందుతారు. యుద్ధరంగంలో నా పరాక్రమం గురించి వినేవారికి భయం నశిస్తుంది. వారి శత్రువులూ నశిస్తారు, వారందరికీ శుభం కలుగుతుంది, వారి కుటుంబమంతా సంతోషంగా ఉంటుంది.

## శరన్నవరాత్రుల గురించి వ్యాసభగవానుడు

**"శృణురాజన్ప్రవక్ష్మామి నవరాత్రి వ్రతం శుభమ్' శరత్కాలే విశేషరో కర్తవ్యమే విధి పూర్వకమ్"**

అని వివరించాడు. సర్వ ప్రాణులకు వసంత ఋతువు, శరదృతువు క్లిష్టమైన కాలాలు, ఇవి జనులందరికీ యన కోరలంటారు. జనులకు దోషాలు కలిగించేవి, జనులకు నాశనం కలిగించేవి. వాటి వలన మనుషులు తమ పరిధులు దాటి చిత్రంగా ప్రకోపించి ఘోరమైన మనస్సుతో బాధపడకుండా, ప్రశాంతతను పొంద డానికి, శరత్‌కాలంలో శరన్నవరాత్రులు నిర్వహించాలని పురాణాలు చెబుతున్నాయి.

## నవరాత్రి అలంకారాలు - పూజలు

తొమ్మిది రోజులు జరిగే నవరాత్రి ఉత్సవాల్లో జగన్మాతను రోజుకో అవతారంలో అలంకరిస్తారు. ప్రతి అవతారానికి ఒక ప్రత్యేక పరమార్థం ఉంది.

పాడ్యమి రోజున, బాలత్రిపుర సుందరి అవతారంలో అమ్మవారిని దర్శించుకుంటే అజ్ఞానం తొలగిపోతుందని విశ్వాసం. బాలాస్వరూపమైన అమ్మవారిని నిర్మలమయిన చిన్న పిల్లల వంటి మనస్సుతో, ఎవరు అర్చిస్తారో వారా జ్ఞానానందంతో కామక్రోధాలను జయించి ఆత్మానందాన్ని పొందగలరు. రెండవ రోజున గాయత్రీదేవి అవతారంలో– ముక్త, విద్రుమ, హేమ, నీల, ధవళ వర్ణాలు కలిగిన అయిదు ముఖాలతో శంఖం, చక్రం, గద, అంకుశం ధరించి అమ్మ భక్తులకు దర్శనమిస్తుంది. వేదమాత, గాయత్రికి మించిన మంత్రము, అమ్మకు మించిన దైవమూ లేవు. 'గాయంతం త్రాయతే ఇతి గాయత్రీ' అని తనను జపించే వారిని గాయత్రీ దేవి రక్షిస్తుంది. మూడవ రోజున, సకల ప్రాణకోటికి ఆహారాన్ని అందించే జగన్మాత అన్నపూర్ణదేవి అవతారంలో ఓ చేతిలో మధురసాలతో ఉన్న మాణిక్య పాత్ర మరో చేతిలో రతనాల గరిట పట్టుకున్న భక్తులకు దర్శనమిస్తుంది. ఆ తల్లి ప్రసాదించేది కేవలం ఆకలిని తీర్చే అన్నం మాత్రమే కాదు, జ్ఞానబిక్ష కూడా. అమ్మ ప్రసాదించే అన్నం జ్ఞానవైరాగ్య భావాల పుష్టిని కలిగిస్తుంది.

నాలుగోవ రోజున అమ్మవారిని సర్వ మంగళకారిణి, ఐశ్వర్య ప్రదాయిని, అష్టలక్ష్మీల సమిష్టి రూపమయిన, శ్రీ మహాలక్ష్మీ దేవిగా అలంకరిస్తారు. అన్ని జీవులలోను ఉండే లక్ష్మీ స్వరూపం దుర్గాదేవి కాబట్టి శరన్నవరాత్రులలో మహాలక్ష్మీని పూజిస్తే సర్వ మంగళ మాంగల్యాలు కలుగుతాయి. పంచమి రోజున, అమ్మవారి జన్మ నక్షత్రమయిన మూలా నక్షత్రం రోజున దుర్గమ్మ చదువుల తల్లి సరస్వతిగా దర్శనం ఇస్తుంది. బ్రహ్మ చైతన్య రూపిణిగా పురాణాలు సరస్వతీ దేవిని వర్ణిస్తున్నాయి. త్రిశక్తి స్వరూపాలలో ఈమె మూడో రూపం. సంగీత, సాహిత్యాలకు అధిష్టాన దేవత. సకల జీవుల జిహ్వాగ్రంపై ఈమె కొలువై ఉంటుంది. ఈ రోజున సరస్వతి పూజ చేస్తే, విద్యార్థులకు బుద్ధి వికాసం కలుగుతుంది.

ఉత్సవాల్లో ఆరో రోజు అమ్మవారు శ్రీలలిత త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనం ఇస్తారు. లక్ష్మి, సరస్వతి ఇరువైపుల వింజామరలతో సేవిస్తుండగా, చిరుదరహాసంతో, భక్తి భావాన్ని చిందించే చెరుకు గడను చేతపట్టుకుని, శివుని వక్షస్థలంపై లలిత త్రిపుర సుందరిగా దేవి దర్శనం ఇస్తుంది. ఉత్సవాల్లో ఏడవరోజు శ్రీ దుర్గాదేవిగా అమ్మవారు భక్తులను కరుణిస్తారు. సింహవాహన్ని అధిరోహించి, త్రిశూలధారిణియై, బంగారు కిరీటాన్ని దరించి దుర్గాదేవి అవతారంలో అమ్మ దర్శనమిస్తారు. దుర్గాదేవిని దర్శించుకుంటే దుర్గతులు ఉండవన్నది భక్తుల విశ్వాసం. శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఎనిమిదో రోజు దుర్గమ్మ శ్రీ మహిషాసుర మర్దినిగా దర్శనం ఇస్తుంది. దుష్టశిక్షణ శిష్టరక్షణార్ధం మహిషాసురుడిని సంహరించి శ్రీ మహిషాసుర మర్దినిగా ప్రఖ్యాతి గాంచిన అమ్మను దర్శించుకుంటే పాపాలు తొలగి సకల శుభాలు కలుగుతాయని ప్రతీతి. ఇక శరన్నవరాత్రి ఉత్సవాల్లో తొమ్మిదో రోజు దుర్గమ్మ, శ్రీరాజరాజేశ్వరి దేవి అవతారంలో భక్తులకు దర్శనం ఇస్తుంది. శ్రీచక్ర అధిష్టానదేవతైన రాజరాజేశ్వరిని దర్శించుకుంటే సర్వత్రా విజయాలు కల్గుతాయన్నది భక్తుల విశ్వాసం.

## నవ దుర్గల ఆరాధన

"అశ్వనీ" నక్షత్రంలో కలసివచ్చిన పూర్ణిమమాసమే "ఆశ్వీయుజమాసం" అవుతుంది. ఈ మాసమందు 'దేవీనవరాత్రుల'ను శరన్నవరాత్రులని పిలుస్తూ శుద్ధపాడ్యమి తిథితో ప్రారంభించి తొమ్మిది రోజులు ఈ నవరాత్రులు వైభవంగా చేస్తారు. జగన్మాత అవతారాలలో ముఖ్యమయిన మహాకాళి, మహాలక్ష్మి, మహా సరస్వతులు, ఒక్కొక్కరూ తిరిగి మూడు అవతారాలను పొందారు. ఆ తొమ్మిది అవతారాలనే మనం 'నవ దుర్గలు' అంటాము.

**ప్రథమాశైలపుత్రి, ద్వితీయా బ్రహ్మచారిణీ**
**తృతీయాచంద్రఘంటీతి, కూష్మాండేతి చతుర్థకం**
**పంచమా స్కందమాతేతి షష్టాకాత్యాయనీతి చ**
**సప్తమా కాళరాత్రీతి మహాగౌరీతి చాష్టకం**
**నవమం సిద్ధదాత్రీచ నవదుర్గాః ప్రకీర్తితాః**

భావం: మొదటి రోజున శైల పుత్రి( హిమవంతుని కుమార్తె)గా, రెండవ రోజున బ్రహ్మచారిణి (తపస్సుకు ప్రతీక)గా, మూడవ రోజున చంద్రఘంట (అర్ధచంద్రుడిని శిరస్సున గంట రూపంలో ధరించిన మనోహర మూర్తి)గా, నాలుగవ రోజున కూష్మాండ (సూర్య ప్రభలతో విరాజిల్లే, సూర్య లోక నివాసిని)గా, ఐదోవ రోజున స్కందమాత (కుమారస్వామి తల్లి)గా, ఆరవ రోజున కాత్యాయిని (సకల వర ప్రదాయిని– గోపికలు కృష్ణుడిని భర్తగా పొందడానికి ఈమెనే ఆరాధించారు), ఏడవ రోజున కాళరాత్రి (నల్లని శరీర చాయతో సర్వ శుభంకరి)గా, ఎనిమిదవ రోజున మహాగౌరి (శివునికి తపస్సు చేసిన పార్వతీ స్వరూపం – ఎనిమిదేళ్ళ బాలికగా పూజిస్తారు)గా, తొమ్మిదవ రోజున సిద్ధిధాత్రి (అష్ట సిద్ధులను ప్రసాదించే దేవత)గా ఆరాధించబడుతుంది.

## జమ్మి పూజ

హిందువులకు ప్రకృతిని పూజించే ఆచారం ఉంది. జమ్మి చెట్టును శమీ వృక్షమని, అపరాజిత అని పేర్లున్నాయి. అపరాజిత అనగా పరాజయం లేనిది. జయప్రదమైనది. అందుకే విజయ దశమి నాడు జమ్మి చెట్టును పూజిస్తారు. పాలపిట్ట దర్శనానంతరం జమ్మి చెట్టు దగ్గరకు వెళ్లి ఆ చెట్టుకు పూజలు చేస్తారు.

**'శమీ శమయతే పాపం, శమీ శత్రు వినాశినీ, అర్జునస్య ధనుర్ధారీ, రామస్య ప్రియదర్శిని'**

అంటూ శ్లోకం పటించిన అనంతరం దేవతలకు తమ కోరికలను తెలుపుతారు. జమ్మి ఆకులను బంగారంగా భావించి ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకుని దసరా శుభాకాంక్షలు (అలయ్ బలయ్) చెప్పుకుంటారు. కాల క్రమేణా జమ్మి చెట్లు ఊళ్లలో లేకపోవడంతో దూర ప్రాంతాల్లోంచి తెచ్చిన జమ్మి కొమ్మలను దేవాలయాల ప్రాంగణాల్లో ఉంచుతారు.

## ఆయుధ పూజ:



పూర్వము పాండవులు శమీ వృక్షము పైన తమ ఆయుధములను దాచి, అజ్ఞాతవాసము చేసారు. ఈ అజ్ఞాతవాసము విజయదశమి అర్జునుడు శమీ వృక్షము పైనుండి తన గాండీవమును దించి కౌరవులతో యుద్ధము చేయటముతో ముగిసింది. కనుక ఆయుధ పూజ రోజున శమీ వృక్షనికి ఒక ప్రత్యేకత ఏర్పడింది. రాజులు ఈ నవమి నాడు తమ ఆయుధములను పూజించు పద్ధతే నేటికీ ఆయుధ పూజగా చేయబడుతున్నది. ఆ ఆయుధములతో పాటు ఛత్రచామరములు రాజలాంఛనములు తానెక్కిన వాహనములు గజము, అశ్వము వాహనములకు రాజులు పూజలు చేసేవారు. నేడు అనేక వృత్తుల వారు తమ పనిముట్లు, యంత్రాలు, వాహనాలకు పూజ చేస్తున్నారు. వ్యాపారులు కొత్త దస్త్రాలు రాసి పూజిస్తారు.

## బొమ్మల కొలువు:

దసరా నవరాత్రులలో పది రోజులు (9 రాత్రులు) బొమ్మలకొలువును పెట్టి, పండుగ జరుపుకుంటారు. దీని అలంకరణకు సాధారణంగా ఐదు, ఏడు, తొమ్మిది, పదకొండు ఇలా బేసి సంఖ్యలో మెట్లుంటాయి. కొందరు, ఐదు మెట్లతో బొమ్మలకొలువు మెదలుపెట్టి, ఏడాదికో మెట్టు పెంచుకుంటూ పోతారు. మెట్ల పై తెల్లని వస్త్రము పరచి ఆ పై బొమ్మలను అమర్చుతారు. వారి వారి కళాదృష్టి, ఆర్థిక స్తోమత, సౌకర్యాలను బట్టి ఈ మెట్లపై రకరకాల బొమ్మలను అమరుస్తారు. కొన్ని ప్రాంతాలలో సంక్రాంతికి బొమ్మల కొలువు పెడతారు. బొమ్మలు అమర్చే పద్ధతి మాత్రం ఇదే.

ముందుగా పాడ్యమి నాడు బొమ్మలు పెట్టే గది కడిగి ముగ్గు పెట్టి, బొమ్మల బల్ల కడిగి పసుపు పూసి, కుంకుమ బొట్లు పెట్టి – పడమటి ముఖంగా కాని, ఉత్తరముఖంగా కాని బల్లను పెడతారు. వర్జ్యం గాని దుర్ముహూర్తం గాని లేకుండా చూసి పసుపు వినాయకుణ్ణి చేసి మొదటి మెట్టు మీద చిన్న పళ్ళెంలో బియ్యం పోసి తమలపాకు మీద పెట్టి, దీపం పెట్టి పూజ చేస్తారు. ఆ పూజ అయ్యాక అసలు కొలువు పెట్టడం ఆరంభిస్తారు. ఇంటి ఆచారాన్ని బట్టి – పార్వతీ పరమేశ్వరులను గాని, సీతారాములను గాని, రాధాకృష్ణులను గాని, లక్ష్మీ సరస్వతులను గాని పెట్టిస్తారు, ఆ ఇంటి అమ్మాయి చేత. ఆ అమ్మాయి మొదటి



దేవతామూర్తిని పెట్టాక, ఆ యేడు కొన్న కొత్త బొమ్మను తల్లి కూడా పట్టుకుని పెట్టిస్తుంది. ప్రతీ ఏడు ఒక కొత్త బొమ్మ తప్పనిసరిగా కొనడం ఆచారం.

దేవుళ్ళ బొమ్మలతో పాటు బొమ్మల కొలువులో తప్పకుండా పెట్టే బొమ్మలు కొన్ని ఉంటాయి. పంచాంగం బ్రాహ్మడు, పెద్ద ముత్తైదువ, పచారీ కొట్టు కోమటి, అతని భార్య, తల్లీ పిల్ల, ఆవూ దూడ వంటివి. ఇవి కాక వివిధ జంతువుల బొమ్మలు, పక్షుల బొమ్మలు, పండ్లు, చెట్ల బొమ్మలు – ఇలా వారి వారి దగ్గరున్న బొమ్మలన్నీ ఆ కొలువులో పెడతారు. కాలక్రమంలో దేశనాయకుల బొమ్మలు, పురాకట్టడాల బొమ్మలు, ప్రయాణ సాధనాలు, వాహనాల బొమ్మల వంటివి కొలువులో చోటు చేసుకున్నాయి. పూసలతో అల్లిన బొమ్మలు, స్వయంగా తయారు చేసిన బొమ్మలు ఇదివరలో బొమ్మల కొలువుల్లో కనువిందు చేసేవి. ప్రస్తుతం ప్లాస్టిక్ బొమ్మలు, బార్బీలు చోటు చేసుకున్నాయి కానీ, ఒకప్పుడు మట్టి బొమ్మలు, పింగాణీ బొమ్మలు మాత్రమే ఉండేవి.

దీప ధూప నైవేద్యాలతో ప్రతిరోజూ లలితా సహస్రనామాలు, లక్ష్మీ అష్టోత్తరం చదివి, ఈ బొమ్మలకు పూజలు చేస్తారు. రోజూ ఒక కన్యకి (చిన్నఅమ్మాయి), ఒక సువాసినికి భోజనము పెట్టి తాంబూలం, అలంకరణ వస్తువులు, బట్టలు ఇస్తారు. ఇలా దసరా తొమ్మిది రోజులు చేస్తారు. ప్రతి రోజూ సాయంత్రము పేరంటానికి ముత్తైదువులను, పిల్లలను పిలిచి, అందరికీ పసుపు – కుంకుమ, తాంబూలము, దక్షిణ ఇస్తే తమకు అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని, అమ్మవారి అనుగ్రహం కలుగుతుందని నమ్ముతారు. ఆ సమయములో మగువలంతా ఇచ్చుపుచ్చుకొనే కుంకుమ ఇల్లాలి సౌభాగ్యానికి చిహ్నము. అష్టగంధము, పసుపు ఆరోగ్యానికి చిహ్నాలు.

ఉత్తరభారతదేశంలో కూడా ఈ కన్యాపూజావిధానం ఉంది. బెంగాలీలు దసరా పండుగను అత్యంత వైభవంగా చేస్తారు. కన్నెపిల్లలకు ఇంతటి ప్రాధాన్యం గల పూజావిధానం ఉండబట్టి, బొమ్మల కొలువు పెట్టే అధికారం ఆడపిల్లల సొత్తయింది అనుకోవచ్చు.

ఇలా అనేక సంబరాలకు, ఆచారాలకు వేదికగా, అమ్మ దయను పొందేందుకు ఆలంబనగా నిలిచే దసరా పండుగ, భారతదేశ ప్రజలందరిలో కొత్త సరదాలు నింపి, ఉత్సాహపరుస్తుంది. నవరాత్రులలో భక్తిశ్రద్ధలతో అమ్మను కొలిచి, అమ్మవారి కృపకు పాత్రులమవుదాము. ఓం శ్రీమాత్రే నమః

**– భావరాజు పద్మిని**

## తెలుగులో వాడుక భాషా ఉద్యమ పితామహుడు, శ్రీ గిడుగు వెంకట రామమూర్తి



గ్రాంథికభాషలో ఉన్న తెలుగు వచనాన్ని వాడుకభాషలోకి తీసుకు వచ్చి, నిత్య వ్యవహారంలోని భాషలో ఉన్న అందాన్నీ, వీలునూ తెలియజెప్పిన మహనీయుడు.

## మన తెలుగు నెలలు ఒక్కో నక్షత్రం పేరు మీద ఒక్కో నెలగా ఏర్పడ్డాయి

1) చంద్రుడు చిత్తా నక్షత్రంతో కలిసిన రోజు పౌర్ణమి రోజు కాగా, ఆ నెలను చైత్రంగా పిలుస్తాం
2) చంద్రుడు విశాఖ నక్షత్రంతో కలిస్తే ఆ నెలను వైశాఖంగా పిలుచుకుంటాం.
3) చంద్రుడు జ్యేష్ట నక్షత్రంతో కలిస్తే ఆ నెలను జ్యేష్టమాసంగా పిలుస్తాం.
4) చంద్రుడు పూర్వాషాఢ నక్షత్రంతో కలిస్తే ఆ నెలను ఆషాఢంగా పిలుస్తాం.
5) చంద్రుడు శ్రవణా నక్షత్రంతో కలిస్తే ఆ నెలను శ్రావణ మాసంగా పిలుస్తాం.
6) చంద్రుడు పూర్వాభాద్ర నక్షత్రంతో కలిస్తే ఆ నెలను భాద్రపద మాసంగా పిలుస్తాం.
7) చంద్రుడు అశ్వినీ నక్షత్రంతో కలిస్తే ఆ నెలను ఆశ్వయుజ మాసంగా పిలుస్తాం.
8) చంద్రుడు కృత్తిగా నక్షత్రంతో కలిస్తే ఆ నెలను కార్తీక మాసంగా పిలుస్తాం.
9) చంద్రుడు మృగశిర నక్షత్రంతో కలిస్తే ఆ నెలను మార్గశిరంగా పిలుస్తాం.
10) చంద్రుడు పుష్యమీ నక్షత్రంతో కలిస్తే ఆ నెలను పుష్యమాసంగా పిలుస్తాం.
11) చంద్రుడు మఖా నక్షత్రంతో కలిస్తే ఆ నెలను మాఘ మాసం అంటాం.
12) చంద్రుడు ఉత్తరఫల్గుణీ నక్షత్రంతో కలిస్తే ఆ నెలను ఫాల్గుణ మాసంగా పిలుస్తాం.

# మానవత్వం

ఒక మేనేజ్‌మెంట్ సెమినార్‌లో మాజీ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ టిఎన్ శేషన్ చెప్పిన తన జీవితానుభవం!

ముఖ్య ఎన్నికల కమిషనర్‌గా ఉన్నప్పుడు ఆయన తన భార్యతో కలిసి పిక్నిక్ కోసం ఉత్తరప్రదేశ్‌లో ప్రయాణిస్తున్నారు. దారిలో, పిచ్చుక గూళ్ళతో నిండి సందడిగా ఉన్న ఒక పెద్ద మామిడి తోటను వాళ్ళు చూశారు.

శేషన్ గారి భార్య రెండు పిచ్చుక గూళ్ళను ఇంటికి తీసుకెళ్లాలని అనుకుంది.

ఆమె అడిగిందే తడవుగా, పొలాల్లో ఆవుల్ని మేపుతున్న ఒక బాలుడ్ని పోలీసుల ఎస్కార్ట్ పిలిచి, గూళ్ళను దించాలని డిమాండ్ చేశారు. పిచుక గూళ్ళను తీసినందుకు 10 రూపాయలు చెల్లిస్తామని ఆ పిల్లాడ్ని ఆశ పెట్టారు. కానీ ఆ బాలుడు అందుకు ససేమిరా అన్నాడు. వారి ఆదేశాన్నినిరాకరించాడు. దీనితో మరి కొద్దిగా రేటు పెంచి 50 రూపాయలు ఇస్తామని శేషన్ బాలునితో అన్నారు.

శేషన్ పెద్ద అధికారి కావడంతో పోలీసులు బాలుడ్ని పిచ్చుక గూళ్ళు చెట్టు పైనుంచి దింపమనీ వత్తిడి చేయడం మొదలు పెట్టారు. ఒక దశలో వారి బలవంతపు ప్రయత్నం ఆదేశంలా మారిపోయింది. ఆ బాలుడు శేషన్, అతడి భార్యతో ఇలా అన్నాడు. "మీరు 50 రూపాయలే కాదు. ఎంత ఇచ్చినా ఎట్టి పరిస్థితుల్లోను పిచుక గూళ్ళను తీసి ఇవ్వలేను సాబ్జీ. నాకు మీ పైసలు అక్కర్లేదు." అంటూ ఎంతో ధీమాగా చెప్పాడు. అంతే కాకుండా "ఆ పిచుక గూళ్ళను తొలగిస్తే ఆ గూళ్ళ లోపల, పిచ్చుకల పిల్లలు ఉంటాయి, నేను మీకు ఆ గూళ్ళు ఇస్తే అందులో ఉన్న పిచుక పిల్లలు ఏమవుతాయి? అవెక్కడుంటాయి? అలాగే ఈ సాయంత్రం వాటి తల్లి పిచ్చుక తన పిల్లలకు ఆహారం తీసుకు వచ్చినప్పుడు తన పిల్లలు కనిపించకపోతే ఆ తల్లి ఎంతగా తల్లడిల్లిపోతుందో, ఏడుస్తుందో ఆలోచిస్తే నాకే కాదు మీలాంటి సదువుకున్న వాళ్లకు కూడా మాటలు రావు. ఇలాంటి పాపపు పనిచేసి ఆ తల్లి పిచుకకు, ఇంటికెళ్లాక మా అమ్మకు నేను మొహం ఎలా చూపించగలను? ఆ పిచుక పిల్లల, తల్లి బాధ చూడటానికి నాకు గుండె ధైర్యం లేదు."

ఇది విన్న శేషన్, అతని భార్య షాక్ అయ్యారు.

"నా స్థానం, హోదా, నా సర్వీసు, నా చదువు, నా IAS అన్నీ కూడా ఆ ఆవుల్ని కాస్తున్న బాలుని ముందు కరిగిపోయాయి" అంటూ శేషన్ చెప్పారు. "నేను అతని ముందు ఈదురుగాలికి కొట్టుకుపోయే ఆవపిండిలా ఉన్నాను. ఆ బాలుడు నా కళ్ళు తెరిపించాడు. ఫలితంగా మా కోరికను వదులుకున్నాం. తిరిగి వచ్చిన తరువాత, ఈ సంఘటన మమ్మల్ని అపరాధభావంతో రోజుల తరబడి వెంటాడుతూనే ఉంది. విద్య యొక్క స్థానం, సాంఘిక స్థితి మానవత్వం యొక్క కొలతకు ఎప్పుడూ గజ స్టిక్ (స్కేల్) కానే కాదు అనే చావులేని నిజాన్ని జీవితంలో మొదటిసారి, ఏ మహోన్నత గ్రంధాలు రిఫర్ చేయకుండా, ఏ మహాత్ముని బోధలు వల్లెవేయకుండా, సుదీర్ఘమైన జప ధ్యానాలూ చేయకుండా తెలుసుకున్నాను."

విజ్ఞానం అనేది ప్రకృతిని తెలుసుకునేందుకు, సమగ్రమైన, మానవ జాతికి, సమస్త ప్రకృతికీ ఉపయుక్తమైన సమాచారాన్ని సేకరించేందుకు, అంతరించని విలువలను తెలుసుకునేందుకు, ఆచరించేందుకు పనికొచ్చే ఒక జ్ఞాననేత్రం లాంటిది! ప్రక్కవాడి కొంప కూల్చకుండా, సాటివాడు కూడా సంతోషంగా ఉండేందుకు ఉపయోగపడినప్పుడే అలాంటి జ్ఞాననేత్రానికి ఒక విలువ ఉంటుందని ఆ బాలుడు నాకు ఆచరణలో నేర్పాడు" అని శేషన్ అన్నారు. ఆచరణ యోగ్యత లేని జ్ఞానం గురించి ఎంత చెప్పుకున్నా, అవి కేవలం మాటలుగానే మిగిలిపోతాయి. అలాంటి కార్యాచరణ లేని జ్ఞానంతో ఏమి చేసినా ఉపయోగం లేదని, తద్వారా ఏమీ సాధించలేమని పేర్కొన్నారు.. మీకు, మాకు, అందరికి సద్భావం, సరైన జ్ఞానం మరియు దాని కార్యాచరణ ఉన్నప్పుడు అందరి జీవితం ఆనందంగా మారుతుందని చెప్పారు.



అప్పట్లో శేషన్ పేరు వింటేనే కాకలు తీరిన బడా రాజకీయ నాయకుల వెన్నులో వణుకు వచ్చిన విషయం ఇక్కడ మనం గుర్తు చేసుకోవాలి.

ఎవరైనా ఏదైనా ఇస్తే ఆశపడటం, తీసేసుకోవడం, దాచుకోవడం నేటి మనుషుల అలవాట్లు. కానీ ఇలాంటివి ఏమాత్రం తెలియని ఆ బాలునికి తాను కొన్ని గొప్ప, ఆదర్శ ప్రాయమైన విలువల్ని పాటిస్తున్నానని కూడా తెలీదు. అలాంటి ఉన్నత విలువల్ని ప్రస్తుత ప్రపంచం ఎప్పుడో మరచిపోయింది. అవి ఉత్కృష్టమైన మానవ విలువలని మనం అనుకుంటున్నా, ఆ బాలునికి మాత్రం అదేమి తెలియదు. శేషన్ అయినా, మరెవరైనా ఆబాలుని దృష్టిలో ఒకటే. భారత రాజ్యాంగం అంటే ఏమిటో, ఎలక్షన్ కమిషనర్ అంటే ఎవరో, ఆ బాలుడికి తెలీదు. తెల్సినదల్లా ఒక్కటే, నిజాన్ని నిజంగా చెప్పగల్గడం!

మన భారత రాజ్యాంగం పౌరులకు ప్రసాదించిన ప్రాథమిక హక్కులు, విధులు, ఆదేశ సూత్రాలూ, స్వేచ్ఛ, సమానత్వం లాంటివి కేవలం లైబ్రరీల్లో మూలనపడి, దుమ్ము కొట్టుకుని, కొత్త ముద్రణకు నోచుకోని పాత గుర్తుల్లాంటి పుస్తకాల్లో పరిమితమైన ఈ కాలపు అవ్యవస్థలో, భారత న్యాయవ్యవస్థ ముందు పేద, ధనిక, హోదా అనే ఎటువంటి బేధాలు ఉండవని, చట్టం ముందు అందరూ ఒక్కటే అనికూడా తెలీని ఒక ముక్కుపచ్చలారని అమాయక బాలుడి నమ్మిక ఏమిటో తెల్సునా? దేవుని దృష్టిలో అన్ని జీవులూ సమానమే! సాటి జీవులపట్ల భూతదయ కలిగి ఉండాలి. ఇవే ఆ బాలుని నమ్మకాలు! కనుకనే బాలుడు అంత నిక్కచ్చిగా, ధైర్యంగా, అంత మంది పోలీసుల్నీ, అధికార యంత్రాంగాన్ని చూసి కూడా జంకకుండా, తన మాటను స్పష్టంగా చెప్పగలిగాడు.

ఎవరో ఒక కవి ఏదో పాత సినిమా పాటలో – "పిల్లలూ, దేవుడూ చల్లనివారే, కల్లకపటమెరుగనీ కరుణామయులే!" అనే వెదజల్లిన అద్భుతమైన సత్యాన్ని మనం ఈ సంఘటనలో దర్శించవచ్చు.

**– ఏ.వి. రమణారావు**

**(కావేసురా ఫేస్ బుక్ వాల్ నుండి)**

*Lovely Stay at Holy Tirupathi* *The Gateway of Lord Balaji*

**HOTEL MAYURA**

**204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)**
**(Opposite Bus Station)**
**Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911**
**e-mail : mayurahotels@yahoo.co.in, Grams :**



# వామన అవతారం

ప్రజలు తమ బాధలు తట్టుకోలేని ప్రతిసారీ ఆ భగవంతుని తల్చుకోవడం నైజం. దైవకృపతో ఆ బాధలు తీరిపోతాయని వారి నమ్మకం. కానీ దేవుడు వస్తే కానీ తీరని బాధలు కలిగితే సాక్షాత్తు ఆ దైవమే కిందకి దిగిరాక తప్పదు. అలా 'కిందకి దిగడం' అన్న మాటను అవతరించడం అంటారు. అలా విష్ణుమూర్తి మానవాళిని రక్షించేందుకు తొమ్మిది అవతారాలు ఎత్తినట్లు చెబుతారు. వాటిలో ఐదవది వామనావతారం.

విష్ణుమూర్తి ధరించిన అవతారాలలో మొదటి మానవ అవతారం వామనుడు. ఈ వామనుడి ప్రసక్తి రుగ్వేదంలోనే ఉందని చెబుతారు. ఇక భాగవతంలో అయితే ఈయన ప్రసక్తి విస్తృతంగా కనిపిస్తుంది. ఒకప్పుడు బలి అనే రాక్షస రాజు ఉండేవాడట. ఆయన ఎవరో కాదు సాక్షాత్తు ఆ ప్రహ్లాదుని మనవడే! బలి మంచివాడే, తన ప్రజలను కన్నబిడ్డలలా చూసుకున్నాడు. కానీ రాక్షసుడు కావడం చేత దేవతలంటే సరిపడేది కాదు. రాక్షస గురువు శుక్రాచార్యుని సహాయంతో బలి ఏకంగా ఆ స్వర్గం మీదకే దండెత్తాడు.

స్వర్గం మీదకు దండెత్తిన బలిని నిలువరించడం ఎవరి తరమూ కాలేదు. దేవతలంతా చెల్లాచెదురైపోయారు. తమను రక్షించమంటూ వెళ్లి ఆ విష్ణుమూర్తినే శరణువేడారు. అంతట విష్ణుమూర్తి తాను అదితి అనే రుషిపత్ని గర్భాన జన్మిస్తానని వరమిచ్చాడు. అలా భాద్రపద శుద్ధ ద్వాదశి నాడు అదితి గర్భాన చిన్నారి విష్ణుమూర్తి జన్మించి బలిని అణచివేసే రోజు కోసం ఎదురుచూడసాగాడు.

మహాబలి ఒకసారి అశ్వమేథయాగాన్ని తలపెట్టాడని తెలిసింది. అతన్ని అణగదొక్కేందుకు ఇదే సరైన అదనుగా భావించిన విష్ణుమూర్తి ఓ చిన్నారి బ్రాహ్మణుడి (వామనుడు) రూపంలో యాగశాల వద్దకు చేరుకున్నాడు. అప్పటికి యాగంలో భాగంగా దానధర్మాలు సాగుతున్నాయి. అందరితో పాటుగా వామనుడు కూడా రాజు చెంతకి చేరాడు. అతనికి 'ఏం కావాలో కోరుకోమంటూ' బలి అడిగాడు. 'నేను ఒంటికాయ శొంఠికొమ్ముని నాకు నగలూ నట్రా అవసరం లేదు. ఓ మూడు అడుగుల స్థలం చాలు,' అని అడిగాడు వామనుడు.

వచ్చినవాడు సామాన్యుడు కాదని రాక్షసగురువు శుక్రాచార్యుడు గ్రహించాడు. కానీ 'అడిన మాట తప్పేది లేదంటూ' బలి తన వాగ్దానాన్ని నెరవేర్చేందుకు సిద్ధపడిపోయాడు. ఎలాగైనా ఈ దానాన్ని ఆపాలనుకున్న శుక్రాచార్యుడు ఓ ఉపాయాన్ని పన్నాడు. శాస్త్రోక్తంగా దానం చేసేటప్పుడు జలాన్ని విడుస్తూ దానమిస్తారు. దీన్నే మనం ధారాదత్తం అంటాము. ఆ ధారాదత్తాన్ని అడ్డుకునేందుకు శుక్రాచార్యుడు కీటకంగా మారి కమండలంలోని నీటిని అడ్డుకునే ప్రయత్నం చేశాడు. కానీ వచ్చినవాడు సామాన్యుడు కాదు కదా! ఒక పుల్ల తీసుకుని కమండం లోకి చొప్పించాడు. దాంతో శుక్రాచార్యుని కన్ను కాస్తా పోయి 'ఏకాక్షి'గా మారాడు.

ఇంతకీ ఆ వామనుడు అడిగిన మూడు అడుగుల కథ గురించి అందరికీ తెలిసిందే! తొలి అడుగు కింద భూమినీ, రెండో అడుగు కింద ఆకాశాన్నీ, మూడో అడుగు కింద బలి తలనీ కోరుకున్నాడు. బలి రాక్షసుడే కావచ్చు. కానీ తన ప్రజలని కన్నబిడ్డల్లాగా చూసుకునేవాడు. అందుకే ఓసారి తిరిగివచ్చి తను పాలించిన ప్రాంతాన్ని చూసుకునే వరం ఈయమని వామనుడికి అడిగాడు. ఆ వరం ప్రకారమే ఏటా బలి పాలించినట్లుగా పేర్కొనే కేరళ రాజ్యానికి ఆయన వస్తాడని నమ్ముతారు. తన ప్రజలు సుఖసంతోషంగా ఉండటాన్ని చూసి, తృప్తిగా తిరిగి స్వర్గానికి మరలిపోతాడట. ఆ సందర్భాన్నే ఓనం పండుగగా జరుపుకొంటారు.

మూడు అడుగులతో ఈ లోకాన్ని జయించాడు కాబట్టి వామనుడికి త్రివిక్రముడు అని పేరు. ఆ త్రివిక్రముని పేరు మీద చాలా ఆలయాలు కూడా ఉన్నాయి. కంచిలో ఉన్న 'ఉళగలంద పెరుమాళ్' ఆలయం, ఖజురహోలో ఉన్న 'వామన' ఆలయం వీటిలో ప్రముఖమైనవి. ఇవే కాకుండా ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్ర, కేరళ తదితర చోట్ల కూడా వామనుడి ఆలయాలు కనిపిస్తాయి. ●





We Provide your comfortable Stay and Tasty Food Hospitality

Bhimas Deluxe Hotel

(PROPRIETORS BHIMAS HOTELS LIMITED)

34-38, G.Car Street (Near Railway Station),
TIRUPATI - 517 501 (A.P.)
Phone : 0877-2225521, 6669199, Fax : 2225471
Website : www.bhimasdeluxehotels.com
E-mail : bhimasdeluxe@rediffmail.com



## సకలయురారోగ్యప్రదాయకమూర్తి

# భగవాన్ శ్రీ ధన్వంతరి స్వామి!

వ్యాధిగ్రస్థులైన వారిని ఆరోగ్యవంతులుగా చేసే ఔదార్యమూర్తీ, విష్ణువాంశ సంభూతుడు శ్రీ ధన్వంతరి స్వామివారు వారిని గూర్చి వివరణ యిచ్చేముందు 'శ్రీ ధన్వంతరీయై నమః' అంటూ వందన శతములు తెలియచేస్తున్నాను.

క్షీరసాగర మదన సందర్భంలో భగవాన్ ధన్వంతరీ జననం జరిగిందనీ, సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడే అధర్వణవేదానికి ఉపవేదమైన ఆయుర్వేదాన్ని ఒకచేత, మూలికా కలశాన్ని మరొకచేత ధరించి, ధన్వంతరీమూర్తిగా అవతరించాడని ఇతిహాసకులు చెప్పడం విన్నాను.

ధన్వంతరీ ఆలయాలు యెక్కడెక్కడున్నాయో, ఎరుగను కానీ, తూర్పు గోదావరీ జిల్లాలోని చింతలూరులో శ్రీ వేంకటేశ్వర ఆయుర్వేద నిలయం స్థాపకులైన ద్విభాష్యం వారు ధన్వంతరీ ఆలయం నెలకొల్పి నిత్యపూజాది కార్యక్రమాలను చేయడమే గాకుండా, ఆలయ ప్రాంగణంలో ఔషధీ మూలికలను ఎండబెట్టడం, వస్త్రగాలితం వంటి కార్యక్రమాల్ని చేస్తున్నట్టు ఒకసారి చూచిన జ్ఞాపకం ఉంది.

**నమామి ధన్వంతరి మాది దేవం**
**సురా సురైర్వందిత పాదపద్మం**
**లోకే జరారుగ్భయ మృత్యునాశం**
**ధాతారమేశం వివిధౌషధీనాం-**
**క్షీరాబ్ధేరుత్థితందేవం పీతవర్ణం చతుర్భుజం**
**నమామి ధన్వంతరీమ్ నిత్యం నానాగద నిఘాదనం**

– అంటూ కార్తీక బహుళ త్రయోదశి నాడు ధన్వంతరీ వ్రతమాచరిస్తారు.

ధన్వంతరీ భగవానుడు తనవద్దనున్న అమృతాన్ని సురులకు పంచిపెట్టాడు, రుగ్మతలు బాపాడు, చిరంజీవులను కావించాడు. ఆయుర్వేదాన్ని పంచమ వేదంగా బ్రహ్మకందించాడు. ఆయన్నుంచీ దక్షునికీ, అశ్వనీ కుమారులకీ, తద్వారా ఇంద్రునికీ ఆయుర్వేదం అందింది.

భూలోకంలోని వారు రుగ్మతలతో వ్యాధిపీడితులు కావడం భరద్వాజ మహర్షికి బాధను కల్గించింది. ఆయన దేవేంద్రుని అర్థించి, ఆయుర్వేదాన్ని భూలోకానికి కొనితెచ్చారు. ఆత్రేయ మహర్షికి బోధించాడు. అక్కణ్ణించీ అగ్నివేశుడూ, భేలుడు, పరాశరుడూ, హారీతుడు, క్షారపాణీ, జతూకర్ణుడు అను ఆరుగురికి నేర్పారు. అగ్నివేశుడు 'అగ్నివేశ తంత్రం' పేరుతో అక్షరరూపం యివ్వగా, చరకుడనే మహర్షి 'చరక సంహిత'గా ఎల్లరకూ ఆయుర్వేదాన్ని విదితమొనర్చారు.

ఇలా ఇలా ఆయుర్వేదం చరకుని కృపతో, ధన్వంతరి ఆశీర్వచనంతో భారతదేశ వ్యాప్తమైంది. ప్రపంచ వ్యాప్తి కూడా అయింది. మనకు తెలిసిన, తెలియని మూలికలెన్నో ఆయుర్వేద వైద్యంలో చోటు చేసుకున్నాయ్. మా తాతగారు శ్రీ గోటేటి విస్సంరాజుగారు భరద్వాజ ఫార్మసీ పేరుతో ఎన్నెన్నో ఔషధాలను 'చరకసంహిత' నాధారంగా మందులు తయారుచేసి అనేకానేక దీర్ఘవ్యాధులను కుదిర్చారు. ఆయన తయారించిన మందుల్లో 'అగ్నితుండి' సర్వరోగ నివారిణిగా రూపొందింది. ఆంధ్ర దేశంలో శ్రీ వేంకటేశ్వర ఆయుర్వేద నిలయం వారు తాతముత్తాతల్నుంచీ వంశపారంపర్యంగా ఈ మందులను తయా రిస్తున్నారు. ఇటీవల వారు ఐ.ఎస్.ఐ. ముద్రను కూడా సంపాదించారు. ఆ సంస్థ ప్రస్తుతం వారు ఆధునిక పద్ధతుల్లో ఆయుర్వేద మందులను రూపొందించి జనులకు అందుబాటులో ఉంచారు. ●

Beautiful City - Beautiful Hotel

DO NOT MISS
Forevear your Serivice in the Heart of Visakhaparnam
HOTEL Daspalla
Suryabagh, Visakhapatna - 520 020, A.P., India.
Ph : 2564825 (6 Lines), 2563141 (4 Lines), Fax : 91-0891-2562043
E-mail : dspvizag1@rediffmail.com, Visit us at : www.daspallahotels.com
Call National Toll Free No. : 1800-425-4225

రుచికి, సువాసనకి, ఆరోగ్యానికి నాణ్యమైన
"అజంతా"
వక్కపొడి
రవికుమార్ అండ్ కంపెని - చెన్నై


# బ్రహ్మాండ నాయకుని బ్రహ్మోత్సవం



**వేంకటాద్రి సమస్థానం**
**బ్రహ్మాండే నాస్తి కించన**
**వేంకటేశ సమో దేవో**
**న భూతో న భవిష్యతి**

– వేంకటాద్రికి సమానమైన మరో క్షేత్రం ఈ బ్రహ్మాండంలోనే లేదు. వేంకటేశ్వరునికి సాటిరాగల దేవుడు ఇంతవరకూ ఎక్కడా లేదు. ఇకమీద కూడా ఉండదు అని అర్థం.

(పై శ్లోకం నా ఫోన్ యొక్క రింగ్‌టోన్ – సుశీలమ్మ గారి గాత్రం. చాలామంది నేను ఫోన్ వెంటనే తీస్తే కోపగించుకుంటారు. ఆ శ్లోకం పూర్తయ్యేదాకా తియ్యకండి అని అంటూ వుంటారు కూడా – ఇలా చాలా సంవత్సరాలుగా జరుగుతోంది).



అడుగడుగు దండాలవాడు, ఆపదమొక్కులవాడు. ఆశ్రితాభీష్ట వరప్రదుడు, కలియుగ ప్రత్యక్ష దేవుడు. పద్మావతీ ప్రాణనాథుడు, సప్తగిరీశుడు శ్రీ వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఈ సంవత్సరం రెండుసార్లు జరుగనున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన తిరుమలరాయుని ఉత్సవాలు ప్రస్తుత పరిస్థితుల రీత్యా కొద్దిమందితోనే జరుగుతాయి. కాని వైభవానికి ఏమాత్రం తక్కువకాకుండా జరిపేటట్లు ఏర్పాట్లు జరుగుతున్నాయి. చాలా మందిలో గుడిలన్ని మూసివేశారు అనే అపోహలు అలాగే వున్నాయి. ప్రజలకు తాము వెళ్ళలేనందువల్లన జనులను ఇదివరలా అనుమతించనందువలనను గుళ్లన్ని మూసివేశారన్న అపోహ వుంది. ఆగమ శాస్త్ర విధిప్రకారం, పురాతనకోవెలలో దేశమంతటా ఆయా పరిస్థితుల కనుగుణంగా అక్కడి వేదపండితులచే స్వాములకు ఏ కైంకర్యాన్ని నిలుపుచేయకుండా, నిత్యపూజలు,నైవేద్యాలు జరుగుతూనే వున్నాయి. అలాగే మహా కలియుగవరదుడు తిరుమలగిరి వేంకటేశ్వరునికి కూడా ఉదయం సుప్రభాత సేవ నుండి రాత్రి ఏకాంతసేవ వరకు అన్ని పూజలు యాధివిధిని జరుగుతూనే వున్నాయి.



ఏడుకొండల వేంకటరమణా మేలుకో తెల్లారవచ్చెను మేలుకో అంటూ ప్రారంభించి, పానుపు వెయ్యరే పడతులారా పవళింపు సేవ చేస్తారు అంటూ పవళింపు సేవ వరకూ అన్ని సేవలను ఏకాంతంగా చేయించుకుంటున్నాడు, ఆ శ్రీమన్నరాయణుడు.

## ఉత్సవ వైభవం

సంతోషాన్ని, ఉల్లాసాన్ని కలిగించేదీ ఉత్సవం. ఆలయాలలో ఉత్సవాలు అనేకరకాలు, నిత్యోత్సవ, వారోత్సవ, మాసోత్సవ, సంవత్సరాంత ఉత్సవాదులు జరుగుతూం టాయి. తిరుమలలో అన్ని ఉత్సవాల కంటే బ్రహ్మోత్సవం ప్రసిద్ధం. బ్రహ్మదేవుడు తిరుమలకు విచ్చేసి తన జనకుడైన వేంకటేశ్వరునికి సభక్తికంగా, వైభవోపేతంగా నిర్వహించే సంబరాలే బ్రహ్మోత్సవాలు. కన్యా మాసంలో శుక్లపక్షాన శ్రవణ నక్షత్రం రోజున సంకల్పించి, బ్రహ్మసంఖ్యయగు తొమ్మిది రోజులు జరిపించే ఉత్సవమే బ్రహ్మోత్సవం.

బ్రహ్మోత్సవంలో ధ్వజస్తంభ స్థాపన, గ్రామాలంకరణ, అంకురార్పణ, ధ్వజా రోహం, నవకుంభారోహణ, హోమం, వీధి ఉత్సవాలు, చక్రస్నానం అనే క్రియలు జరుపుతారు. సేనాధిపతియైన విష్వక్సేనుల వారు దేవతలను ఈ బ్రహ్మోత్స వానికి ఆహ్వానిస్తారు. సకల దేవతలు ఈ బ్రహ్మోత్సవాలో అరుదుగా తిరుగుతూ వుంటారని అందుకే ఈ ఉత్సవాలు ఇసుక వేస్తే రాలనంత జనంతో క్రిక్కిరిసి జరు గుతూ వుంటాయి. కాని ప్రస్తుతం ఈ కరోనా మహమ్మారి వల్ల ఆగమ విధులకు ఎటువంటి ఆటంకం కలుగకుండా ఎప్పటిలాగానే ఈ ఉత్సవాలు వైభవోపేతంగా జరిగేటట్లు కాకపోతే ఏకాంతంగా జరిపే ఏర్పాటులు చేస్తున్నారు.

ఈ బ్రహ్మోత్సవాన్ని గురించి వర్ణిస్తూ వేయినోళ్ళున్న ఆదిశేషుని వర్ణింప వీలుకానంత రంగరంగ వైభవంగా జరుగుతాయని ప్రతీతి. ప్రస్తుం వున్న టెక్నాలజీని



ఉపయోగించుకుంటూ ఈ ఉత్స వాలు నేరుగా వీక్షించే వీలు లేక పోయినా SVBC ఛానల్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం ఉంటుంది.



మొదటిరోజు ధ్వజారోహణా నంతరం ఆ రాత్రి స్వామివారికి పెద్ద శేష వాహనం వూరేగింపు జరుగు తుంది. ఆరోజున ఆంధ్రప్రదేశ్ ప్రభు త్వం తరపున స్వామివారి పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. ఆ మరు నాడు రెండవరోజు రెండువేళలా చిన్నశేషవాహనం, హంస వాహనం, మూడవ రోజు సింహవాహనం, ముత్యపు పందిరి, నాల్గవరోజు కల్ప వృక్ష వాహనం, సర్వభూపాల వాహ నం, ఐదవ రోజు దండల పల్లకి, మోహిని అవతారం, ఆ రాత్రి గరుడోత్సవం జరుగుతుంది. ఆరోజు శ్రీ విల్లిపుత్తూరు నుండి గోదాదేవి ధరించిన పూలమాల, మద్రాసు నుండి కొత్త గొడుగులు వస్తాయి. వీటన్నిటినీ ధరించి మలయప్పస్వామి బంగారు గరుడునిపై ఊరేగింపబడతారు. ఈ ఉత్సవాలన్నీ నాలుగు మాడవీధులలోను దేదీప్యమాన అలంకరణలతో కనుల పండువగా జరుగుతాయి. ఇక ఆరవరోజు హనుమద్వాహనం, గజవాహనం, ఏడవ రోజు సూర్యప్రభ వాహనం, చంద్రప్రభ వాహనం, ఎనిమిదో రోజు రథోత్సవం, అశ్వవాహనం జరుగుతాయి. తొమ్మిదోరోజు చక్రస్నానం, ఆ రాత్రి ధ్వజారోహణం కార్యక్రమాలు ఘనంగా నిర్వహింపబడతాయి. ఈ సంవత్సరం తి.తి.దే. ప్రజా సంబం ధాల అధికారిక విడుదల ప్రకారం ఈ బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ 18 నుండి సెప్టెం బర్ 26 వరకూ జరుగనున్నాయి. సెప్టెంబర్ 18న అంకురార్పణ, 19వ ధ్వజా రోహణం సెప్టెంబర్ 23న గరుడసేన, 24వ స్వర్ణ రథోత్సవం, సెప్టెంబర్ 27 చక్రస్నానంలో ధ్వజారోహణంలో బ్రహ్మోత్సవాలు సమాప్తి. ఈ సంవత్సరంలో రెండు బ్రహ్మోత్సవాలు రెండవది నవరాత్రి సమయంలో 15-10-20 నుండి 24-10-20 వరకూ జరుగుతాయి. కాబట్టి మన ఉత్సవాల దేవుడు తిరుమల గిరీశుడు శ్రీ వేంకటేశ్వరుని ఉత్సవాలను ప్రస్తుతం ఉన్న కరోనా రీత్యా తితిదే అందించే ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించి ఆనందించి తన్మయత్వం చెందగలరని ఆశిస్తున్నాను. ●



# ప్రముఖ సాహితీమూర్తి కీర్తిశేషులు దోమా వెంకటస్వామి గుప్తా గారి జీవితంలో కొన్ని మధుర జ్ఞాపకాలు

వీరు 1889 నరక చతుర్దశి రోజు, కర్నూలులో జన్మించారు. ఆ తరువాత వారి విద్యాభ్యాసం అంతా గుంటూరు జిల్లాలోనే జరిగింది. దోమా వారు వైశ్య జాతిరత్నం. వారు తమ జీవిత కాలంలో 50000 పైగా పద్యాలు రాశారు. పద్యం అంటే వీరికి ప్రాణం. ఏ విషయం అయినా చెప్పాలనుకుంటే పద్యంలోనే చెప్పడం వారికి ఇష్టం. వీరు 300 కి  పైగా అవధానాలు చేశారు. మన రాష్ట్రంలోనే కాకుండా పొరుగు రాష్ట్రాలలో కూడా అవధానాలు చేసి ప్రశంసలు పురస్కారాలు పొంది, స్వర్ణ పథకాలను, గజారోహణ, గండపెండే రాది, గౌరవాలను పొందిన వ్యక్తి శ్రీ గుప్తా గారు.

గుప్తా గారి జీవితాన్ని సాహిత్యంతో ముడి పెట్టి చూడాలి, సాహిత్యం లేని గుప్తా గారిని చూడడం అసాధ్యం. అలాంటి వ్యక్తి గుప్తా గారు.. వీరి గ్రంధ రచనలు లెక్క పెట్టలేము. కన్యకా పురాణంలో సరస్వతీ ప్రార్ధన ఇలా చేశారు..

తల్లి నీదు పదారవిందంల నాత్మన్ బ్భాని నీ వయనవ్.  అనే పద్యంలో... అమ్మ!  ఓ శారదా? నీకు ఉల్లాసాన్ని కలిగించే విధంగా గ్రంథాలు రాసి మీకు సమర్పించిన కవులందరికీ, ఈ లోకంలో ఏ రకమైన బాధలు లేకుండా వరాన్ని దయచేయవమ్మా అని ప్రార్థించాడు. ఇలాంటి వ్యక్తిత్వం చాలా తక్కువ మందికి ఉంటుంది. తన గురించి మాత్రమే కాకుండా తనలాంటి అందరిని గురించి ఆలోచించే మనసు వీరికి మాత్రమే ఉంది. వీరు చిన్ననాటి నుండి అవధానాలు చేశారు. దోమా వారే స్వయంగా 17 సంవత్సరముల వయస్సు నుండి, అవధానాలు చేశారని చెప్పుకున్నారు. వీరు తెనాలిలో చేసిన శతావధానం, వీరి చిన్న వయసులోనే పుస్తక రూపంలో రావడం గొప్పతనం. మీరు ఆశు కవిత్వం చెప్పడంలో దిట్ట. గంటకు నూరు పద్యాలు ఘంటాపథంగా చెప్పగలను అని తెలియజేశారు. ఆనాడు వీరు ఆశువుగా చెప్పిన పద్యాలు ప్రబంధాలగా, నాటి శ్రోతలు విని, ఆనందించేవారు. అవధానంలో అడిగే ప్రశ్నలకు ధారగా సమాధానం చెబుతుంటే దయచేసి తగ్గించ వలసినదిగా కోరే వారట. అంతటి ధారా శక్తి గుప్తా గారిది.

తెలుగు సాహిత్యంలో ఉన్న ప్రక్రియలూ అన్నింటిలో రచనలు చేసిన ఘనత వీరిదే. ఆధునిక కాలంలో అత్యధికంగా అవధానాలు చేసిన సరస్వతీ పుత్రులు. అవధాన ప్రక్రియ వైభవాన్ని మహాత్మాగాంధీకి తెలియజేసి వారి ప్రశంసలు పొందిన సుకవి. వీరీ కుల దేవత శ్రీ వాసవి అమ్మవారిని వివిధ ప్రక్రియలతో అర్చించి తరించిన ఆర్యవైశ్య మణిరత్నం శ్రీ దోమా వారు అలంపురం క్షేత్ర వైభవాన్ని వర్ణిస్తూ తెలుగులో బ్రహ్మేశ్వర పురాణాన్ని వ్రాశారు. వీరికి జాషువా గారు అంటే చాలా ఇష్టం. ఆయన ఖండ వ్యాఖ్యలన్నా, అపరిమితమైన అభిమానం. వీరు వైశ్య కులములో జన్మించడం వల్ల  ఆ కులమే పావనమైనది అని చెప్పవచ్చు. వైశ్య కులంలో లక్ష్మీ నరసింహం సోమయాజి వంటి విప్లవాత్మక భావాలు కలిగిన ఉద్యమ కర్తలు, మామిడి వెంకటాచార్యులు వంటి కవులు, ఆత్మూరి రామమోహన్ లాంటి కళాకారులు, చిత్ర లేఖకులు, నాళం రామలింగయ్య వంటి దానకర్నులు, ఆంధ్ర అనిబి సెంట్ అని పిలువబడే, శ్రీమతి భత్తుల కామాక్షమ్మ వంటి సేవకురాలు, ఇలా ఎందరో ఈ జాతిలో జన్మించి భారత జాతికి ముద్దుబిడ్డలు అయ్యారు. ఇలాంటి కోవకు చెందిన, అపర సరస్వతీ మూర్తులు శ్రీ దోమా వెంకటస్వామి గుప్తా గారు.

62 సంవత్సరాలు జీవించి వారి సాహిత్య వాసనాలను యావత్ భారతదేశం అంతా వెదజల్లిన ధన్యజీవి. వీరి పేరుతో 1991లో దోమా వెంకటస్వామి గుప్తా సాహిత్య పీటాన్ని, కడపలో, కీర్తిశేషులు పాలది లక్ష్మీకాంతం గారు, గుత్తి గ్రామం ఇల్లూరు శంకరయ్య గారు, మొదలగు సభ్యులతో స్థాపించడం జరిగింది. ప్రతి సంవత్సరం వీరి పేరు మీదుగా వీరు పరమపదించిన,  ఫిబ్రవరి 13వ తేదీన కవులను సత్కరించడం నేటికీ కొనసాగిస్తూనే ఉన్నారు. ఇలా ఎందరో మహానుభావులు జన్మించిన భరతభూమి ఎంతో పవిత్రమైనది.

వీరి జ్ఞాపకార్థం వీరి కాంబినేషన్లో, కర్నూలు వాస్తవ్యులు, శ్రీ దోమ వెంకటరమణ గారు, తదితర బంధుమిత్రులు, శ్రీ దోమా వెంకటస్వామి గుప్తా గారి విగ్రహాన్ని కర్నూల్‌లో ప్రతిష్టించడం, ఆనందించదగ్గ హర్షించదగ్గ విషయం... మరియు ఆర్యవైశ్య లోకానికి గర్వకారణం.

*(వీరు మా శ్రేయోభిలాషులు శ్రీ సాయినాధ్ గుప్త, సురేంద్రనాధ్ గుప్త గార్ల తండ్రి గారి సోదరులు)*



# మంత్ర బలం



శుక్రాచార్యుడి దగ్గర మృత సంజీవిని విద్యని నేర్చుకోవటానికి వెళ్ళిన కచుడిని రాక్షసులు సంహరించి అతని భస్మాన్ని సురాపానంలో కలిపి తమ గురువైన శుక్రాచార్యుల చేత త్రాగిస్తారు. తాను మోహించిన కచుడి జాడ తెలియక దేవయాని వ్యధతో తన తండ్రి శుక్రాచార్యుడిని ఆశ్రయిస్తుంది. దివ్య దృష్టితో జరిగినదంతా గ్రహిస్తాడు శుక్రాచార్యుడు. అప్పుడు తన తపోశక్తితో తన దేహంలో భస్మమైవున్న వున్న కచుడిని బ్రతికించి అతనికి మృత సంజీవనిని ఉపదేశిస్తాడు. ఆ పిమ్మట కచుడు శుక్రాచార్యుడి శరీరం నుంచి వెలుపలికి రాగా శుక్రాచార్యుడు విగత జీవి అవుతాడు. తాను ఉపదేశపూర్వకంగా నేర్చుకున్న మృతసంజీవిని విద్యతో మరల శుక్రాచార్యుడిని కచుడు పునరుజ్జీవితుడిని చేస్తాడు. ఈ సన్నివేశంలో శుక్రాచార్యుడి శరీరం నుంచి వెలుపలికి వస్తున్న కచుడిని వర్ణిస్తూ భారతంలో నన్నయ, "ఉచ్చారణ దక్షు చేత అభిహితంబగు శబ్దం నట్లు బోలె" అంటాడు. అక్షరాలకి జీవం పోసే శక్తి ఉచ్చారణకి వుంది. మంత్రాన్ని జపించేటప్పుడు ఉచ్చారణ చాలా ప్రాముఖ్యత వహిస్తుంది.

"మననాత్ త్రాయతే ఇతి మంత్ర" – దేనిని మననం చేస్తే మనకు రక్షణ ఇస్తుందో దానినే మంత్రం అంటారు. మంత్రోపాసన పలు రకాలుగా చేస్తారు. గట్టిగా పైకి ఉచ్చరించే విధానం వైఖరీ జపం. మంద్ర స్థాయిలో చాలా తక్కువ శబ్దంతో ఉచ్చరించే విధానం ఉపాంసు జపం. దీనికి మంచి ఏకాగ్రత కావాలి. ఈ విధానం వైఖరీ జపం కన్నా 1,000 రెట్లు ఉత్తమం అని అంటారు. మనసులోనే మౌనంగా మంత్రాన్ని ఉచ్చరించే విధానాన్ని మానసిక జపం అంటారు. ఈ విధానం వైఖరీ జపం కన్నా 100,000 రెట్లు శ్రేష్టం అని చెబుతారు. ఈ స్థితిలో సాధకుడు ఏకాగ్రత స్థాయిని దాటి అచంచల విశ్వాసంతో సాధన చేస్తాడు. ఈ మూడు విధాల జపాన్ని గురించి శాండిల్యోపనిషద్‌లో వివరించబడింది. వీటన్నింటికన్నా విశిష్టమైనది తపస్సాధన. ఈ స్థితిలో సాధకుడు పూర్తిగా అంతర్ముఖుడై బాహ్య ప్రపంచాన్ని విస్మరించి సమాధి స్థితిలోకి వెడతాడు. లలితా సహస్రంలో అమ్మవారి నామావళిలో "అంతర్ముఖ సమారాధ్యా బహిర్ముఖ సుదుర్లభా" అనే నామం వుంది. అంతర్ముఖుడై ధ్యానం చేసిన భక్తుడు ఆ పరాశక్తిని సులభంగా గ్రహించగలడు. బాహ్యంగా ఎన్ని పూజలు, వ్రతాలు చేసినా ఆ దేవిని దర్శించ లేడు. లలితా సహస్రనామ స్తోత్రంలో 162వ శ్లోకంలోని పై వాక్యం ఎంతో అర్ధవంతమైనది. మనిషి అంతర్ముఖుడు అవ్వాలి అంటే ముందు ధ్యాన సాధన చెయ్యాలి. ధ్యాన సాధనలో ప్రాథమిక దశలో ఉన్నప్పుడు కళ్ళు మూసుకుని మౌనంగా వుండటం అభ్యాసం చెయ్యాలి అంటారు. కళ్ళు మూసుకున్నప్పుడు బాహ్య ప్రపంచం నుంచి దృష్టి మరలి మనస్సు ఆత్మపై లగ్నమవుతుంది. చుట్టూ శూన్యంగా వున్న ఆ స్థితిలో ఆలోచనలకి క్రమేపి నిలకడ ఏర్పడి సాధనలో స్థాయి పెరిగినకొలది ఆ ఆలోచనలు శూన్యంలో కలిసిపోతాయి. మౌనంలో కేవలం మనకి మన శ్వాశ మాత్రం వినిపిస్తుంది. మనిషి ఉచ్వాశ నిస్వాసాలలో సోహం అన్న శబ్దం నిబిడీకృతం అయివుంది. సోహం అన్న పదానికి నేను ఈ సృష్టిలో కేవలం భాగమే కాదు నేను ఈ సృష్టి అంతటా వ్యాపితం అన్న అర్ధం కూడా వుంది. మౌనంలో ఉన్నత స్థాయికి మనిషి చేరువ అయినప్పుడు ధ్యాన స్థితిలో అతనికి ఆ శ్వాశ శబ్దం "సోహం"లో దాగివున్న "ఓం" అనగా ఓంకారం (సోహంలో సహ అక్షరాలు తొలగిస్తే ఓం అగుపిస్తుంది) గ్రాహ్యమవుతుంది. శబ్దానికి మూలం ఓంకారం. ఓంకారంలో ఆకర, ఉకార, మకారాలు దాగి వున్నాయి. భాషలోని పదాలు అన్నీకూడా అకార, ఉకార, మకార శబ్దాలలో ఒక శబ్దంతో కూడుకుని ఉన్నవే. ధ్యాన సాధనలో మనిషికి సృష్టి సమస్తము ఓంకారం వ్యాపించి వున్నదని, సృష్టికి మూలం ఓంకారమని అవగతమవుతుంది. శక్తి బీజాక్షరాలలో ఓంకారం ప్రధానమైనది. ఎప్పుడైతే మనిషి అంతర్ముఖుడై ధ్యాన నిమగ్నుడై మౌనంలో తన శ్వాస పైన ఏకాగ్రత వహించి శ్వాశలో దాగివున్న ఓంకారాన్ని గుర్తిస్తాడో అతను తనలోనే దాగివున్న ఓంకార శక్తి స్వరూపిణి అయిన పరాశక్తిని గ్రహించగలడు.

మంత్ర జపంలో వైఖరీ జపంతో ప్రారంభించి ఉపాంశు, మానసిక జపాల స్థాయిని దాటి అంతర్ముఖుడై తపస్సాధనతో శబ్దం నుంచి నిశ్శబ్దంలో ఓంకార ప్రణవ నాదాన్ని గుర్తించిన సాధకుడు జీవన్ముక్తుడవుతాడు.

**– డాక్టర్. బీ.యన్.వీ. పార్ధసారధి**


## ప్రముఖాంధ్ర అభిమానులకు ఆహ్వానం, అభ్యర్ధన!

**ప్రముఖాంధ్ర గత 26 సంవత్సరాలుగా నిరాటంకంగా వస్తూనే వుంది. ఎందరో అభిమానులు ఏ పరిమాణంలో సహాయం అందించాలని ఫోన్లు చేస్తున్నారు? 'వేలు'గా ఇవ్వ అవకాశం లేని అభిమానులున్నామంటున్నారు.**

**అలాటి మహోదయులకు, మహా హృదయులకూ పరిమితి లేదు, పరిధి లేదు. మీ శక్తికి తగినట్లు, మీ మనసుకు తోచినట్లు సహాయ సహకారము లందచేయండి! ప్రతా ఒక్క నీటిబొట్టూ కూడితేనే ప్రవాహమవుతుందీ, జీవనదీ అవుతూంది. చేరిన ప్రతీ నీటిబొట్టునూ దాచుకొని సాగరం తిరిగి మేఘమై, మేఘం వర్షమై చినుకు చినుకుగా భువినెలా సస్యశ్యామల కోమలం చేస్తూ పంటలను పండిస్తూందో – మేమూ అలానే మీ ప్రతీ 'రూక'నూ ప్రముఖాంధ్రుల భాషా సేవకే వినియోగిస్తాం. 'ప్రముఖాంధ్ర'ను పంట పొలంగా చేసి, తెలుగు అక్షర విత్తులను పండిస్తాం. ఇదే మా వినతి! ఇదే మా అభ్యర్ధన. ఇదే మా హృదయపూర్వక ఆహ్వానం. పోస్టు ద్వారా ఉత్తరాలు వ్రాసి ఉన్న డబ్బులను కూడా హరింపచేయలేం. గ్రహించండి.**

**రూ. 251, 1001, 2001, 5001, 10,001, 25,001, 50,001 మీ ఇష్టం ఎంతైనా**

**ప్రముఖాంధ్ర బ్యాంక్ వివరాలు :**

| | | |
|---|---|---|
| Account Name | : | **PRAMUKHANDHRA** |
| Account No | : | **20011102592** |
| Bank | : | **BANK OF MAHARASTRA, T.NAGAR** |
| IFSC Code | : | **MAHB 0000450** |

**ప్రముఖాంధ్ర**

**64, తంబయ్యారెడ్డి వీధి, వెస్ట్‌మాంబళం, చెన్నై – 33.**

**మొబైల్ : 98400 48941**





# స్వరవిరించి పెండ్యాల - పాటల టంకసాల ఘంటసాల

టేకుల సెలక్షన్లో పెండ్యాల గారు చూసే శ్రద్ధాసక్తులు మెండు. రాత్రిళ్ళు రికార్డింగులు జరిగేటప్పుడు గాయకులు వాయిద్యకారులు అలసిపోయి ఇంటికి దౌడు తీసినా తెల్లవారిపోయినా ఇసుమంతయు విసుగొందక, చేయించిన ఇరవై టేకులూ విని, ప్రతీ టేకులోనూ, తనకి నచ్చిన తునకలు (బిట్స్) అన్నీ గుర్తించి పెట్టుకుని, వాటినన్నిటినీ కలిపి, మొత్తం మీద నీటైన టేకొకటి తయారుచేసుకునేవారు. పందొమ్మిదో టేకులో ఫ్లూటు బిట్టూ, ఎనిమిదో టేకులో ఎకార్డియన్ పీసు, పదో టేకులో పల్లవీ, ఐదో టేకులో అనుపల్లవీ, మూడో టేకులో మేండలిన్ పోర్షన్, చివరి టేకులో చరణం ఇలా తుంచిన తుండులన్నీ ఏరుకుని మంచి పందులాంటి టేకు తయారుచేసుకోవడం వీరికే చెల్లింది. ఓర్పుకు మారుపేరు పెండ్యాల. ఆ ఓర్పుని నేర్పుతో ఎలా సమయానుకూలంగా ఉపయోగించుకోవాలో వీరికి బాగా తెలుసు. వీరు గోతుల్యమైన సాధు స్వభావులు... గాయకులు సరిగా పాడలేకపోయినా విసిగిపోయి "ఈ పాట ఖర్మ ఇంతే, మనం ఏం చేయగలం చెప్పండి, ఒక్కొక్క పాట జాతకమే అంత" అని ఆవేదనతో నిట్టూర్పు విడిచారే తప్ప, సూటిగాగానూ, చాటుగా గాని, ఎవరినీ ఏమీ అనరు. ఎలాగైనా ఆ పాట గాయకున్నించి రాబట్టుకునేవారు.

## ఘంటసాల గారి గురించి పెండ్యాల నాడు కపిలవాయి నేడు ఘంటసాల

ఆయన గురువుగారు కపిలవాయి రామనాధశాస్త్రిగారు తరువాత అంతగా ప్రజా హృదయంలో పాతుకుపోయిన గాయకుడు ఘంటసాల వేంకటేశ్వరరావు గారే ఈ మాట నా మాట కాదు, ఆనాడు వారినీ, యీనాడు వీరినీ, యిరువురినీ విన్నవారందరూ ఏకగ్రీవంగా ఆమోదించిన మాట. శ్రీ రామనాధశాస్త్రి గారిలా ఆ రోజులలో గాయకులున్నా ఆయనే గొప్ప గాయకుడు. ఇది ఏకాభిప్రాయం. ఆరోజులలో ఎంతమంది గాయకులున్నా ఆ గాత్ర మాధుర్యము, ఆ అదృష్టము, ఆ దైవదత్తమైన ఆ గాత్ర మాధుర్యము, కోట్ల సంఖ్యలో ఎవరికో ఒక్కరికే అబ్బగలిగిన అదృష్టము మళ్ళీ ఘంటసాలగారికే దక్కింది. ఆ త్రిస్థాయి శారీరం, ఏ స్థాయిలో ఏ స్వరము పట్టినా, పరిశుద్ధమైన సంపూర్ణమైన నాదపురాణ ఆనాడు శ్రీ కపిలవాయి రామనాధశాస్త్రిగారికే యీనాడు, శ్రీ ఘంటసాలగారికే లభ్యమైనది.

ఆహ్యయైన గాత్ర మాధుర్యం, కథను త్రొక్కే ఆ పద్యపు నడక, ఆ సుస్నిగ్ధమైన ఉచ్చారణ, ఆ భావ ప్రకటనా ప్రాభవంతో ఆనందంతో ఉప్పొంగిపోయి ఆశీర్వదించింది. తెలుగు భాష యొక్క గౌరవం నిలబెట్టు నాయనా! అని దాని పర్యవసానమే యీనాటి ఘంటసాల చరిత్ర, సంగీతాన్ని ఉపాసించే ఆశతో మధూకరమే ఎత్తుకున్నాడో, మట్టి నేలలపైన శయనించాడో – ఆయన కృషిఫలం, ఆంధ్రదేశం గర్వించింది... ప్రజా హృదయం ఆయనను తన ముద్దుబిడ్డగా తనలో దాచుకుంది. ఆ అమృత జల్లుల ఫలితంగా యీనాడు ప్రతీయూరా ఎందరో ఘంటసాలలు ఉద్భవించారంటే, ఆ కళామతల్లి శ్రీ ఘంటసాల ద్వారా కళాకారుల నాశీర్వదించింది. ఘంటసాల పాడితే అది తెలుగుదనపు శోభ, ఆయన పాటలకు బాణీలు కడితే అది తెలుగు చల్లదనపు తేట!! ఆయన ఉపన్యాసం చెబితే అది తెలుగు పన్నీటి జల్లులవాన!!! ఆయన పరిపూర్ణ కళాకారుడు, ఆర్ద్ర హృదయుడు, దైవభక్తుడు. ఆయన పాటలు అజరామరం. ఘంటసాల గారిపై పెండ్యాల గారి పన్నీరు జల్లు వంటి మాటల మూటలు.

పెండ్యాలగారు సంగీత దర్శకత్వం వహించిన మొదటి చిత్రం ద్రోహిలో ఘంటసాలగారు జి.వరలక్ష్మితో "పూవు జేరి పలుమారు తిరుగుచూ" అనే యుగళగీతాన్ని పాడారు కన్నతల్లిలో రెండు సోలోలు పాడారు. దొంగరాములో రెండు పాటలు ప్రజాదరణ పొందాయి. ఈ చిత్రం నుంచి ఘంటసాల పెండ్యాల యుగం మొదలైంది. 1957లో అక్కాచెల్లెళ్ళు చిత్రంలో సుశీలతో పాడిన యుగళగీతం "నీ రూపు నా హృదయం రెండు రాళ్ళే" అనే పాటలో ఘంటసాల గాత్రంలో ఆవేదన, నవ్వులో విరహము చాలా గొప్పగా పలికాయి. పెండ్యాల గారికీ ఘంటసాల గారంటే అభిమానము, ఘంటసాల పాడితే గాని పెండ్యాల లేదు అనేవారుట. కాని పెండ్యాలకి ఘంటసాలగారంటే వృత్తిపరమైన అసూయ వుండేదంటారు. ఘంటసాల గారు సంగీత దర్శకత్వం వహిస్తున్నారు, పాటలు పాడుతున్నారు, కచేరీలు చేస్తున్నారు అన్నివిధాలా డబ్బు సంపాదిస్తున్నారని అసూయ వుండేదిట. పెండ్యాలగారు ఎక్కువ టేక్లు పాడించేవారుట. అన్నిచూసి చివరకు మొదటి టేకు చాలా బాగుందని అది తీసుకునేవారుట. ఘంటసాలగారు బి.పి., షుగర్తో అలసిపోయేవారుట. రాత్రి తలనొప్పితో బాధపడేవారుట. పెండ్యాలగారు ఎక్కువ టేకులతో నా శక్తినంతా పీల్చేస్తున్నారు. నేను ఇక ఆయనకు పాడను అనేవారుట తలనొప్పితో...

పెండ్యాలగారు వచ్చి మాష్టారు నాకు మంచి అవకాశాలు వస్తున్నారు.

## తెలుగువారు బహు పరాక్!

**'బ్రతికినన్నాళ్ళు దుర్భరాపదల గుడిపి చచ్చినంతనె ఆత్మకు శాంతి పల్కి వీరపూజలు గావించు వెర్రి తనము తెలుగుదద్దమ్మకే సమృద్ధిగా లభించె'**

**- అన్నారు 'తెలుగులెంక' కవి శ్రీ తుమ్మలవారు. బ్రతికుండగా బలుసాకు తిని ఇతరులకు వెలుగైనవాడు క్రొవ్వత్తిలా హరించుకొనిపోవడమే తప్ప వారికి 'తులసి తీర్థం' కూడా పోయరు. చచ్చిన తరువాత వారి ఆత్మకు శాంతి వచనాలు పలుకుతూ వీరపూజలు చేసేవారు మన తెలుగువారు. వారి ఆశయాలను అలా వీరపూజలతోనే వారి పనిని సరిపెట్టుకొంటారే తప్ప, మరునటి రోజునుంచీ ఆచరించే ప్రక్రియకుపక్రమించరు. ఇది 'గునుపూడి జంగముల' సామ్యంలా ఉంటుంది. ఈ తప్పిదాన్ని యిప్పటికైనా తెలుగువారు గ్రహించి, తెలుగునభివృద్ధిపరచడం అవసరం. ఈ కార్యక్రమాన్ని ఎక్కడెక్కడున్నా తెలుగువారు యుద్ధప్రాతిపదికను చేబడితేనే తెలుగుకు ప్రయోజనం చేకూరుతుందని గ్రహించండి!!**

అద్భుతమైన పాటలు చేస్తున్నాను. మీరే పాడాలి, మీరు పాడకపోతే పాట రాణించదు అనేవారుట. మళ్ళీ పెండ్యాలకు పాడాలా అనుకుని మరల ఆయన మీరే పాడాలి మాష్టారు అంటే. మంచి పాటంటున్నారు, మన వృత్తి పాడటమే. ఆయనకు ఆడపిల్లలున్నారు, పెళ్ళిళ్ళు చేయాలి. ఇదొక్కటే ఆదాయం ఆయనకు. పాడకపోతే ఆయన పాటలకు ప్రజాదరణ ఉండదు. పాడదామనేవారుట. అంత సుహృదయుడు ఘంటసాలగారు. పాటల రిహార్సల్స్‌కి అందరు ఘంటసాల గారింటికి వస్తే పెండ్యాల ఆఫీసుకు రమ్మనేవారుట. ఘంటసాల గారు చనిపోయిన తరువాత ప్రతీ ఇంటర్వ్యూలోను ఘంటసాల గారి కీర్తిని కొనియాడేవారుట. ఘంటసాల నా బాహిర్ ప్రాణం అనేవారుట. వారి ఋణం నేను తీర్చుకోలేను. నాకు పేరుప్రఖ్యాతులు రావటానికి ఘంటసాల గారి పాటలే కారణం అని చెప్పేవారుట. ఘంటసాలగారు తన జీవితంలో మంచి తృప్తినిచ్చిన చిత్రం జయభేరి పాటలనేవారుట.

నా జీవితకథలాగా జయభేరి చిత్రం కూడా అని తను చిన్నప్పుడు సంగీతం కోసం ఎంత కష్టపడ్డానో ఇందులో నాగేశ్వరరావు పాత్రలో చూపించారు. ఆరుద్ర గారిని తన జీవితకథ రాయమని చెప్పారుట. ఆయన తయారుచేశారుట. తాతినేని ప్రకాశరావు దర్శకత్వంలో తీద్దామనుకున్నారుట. కాని సొంత చిత్రాలు తీసి భాగస్వాముల మోసంతో ఆర్థికంగా నష్టపోయి చిత్రనిర్మాణం విరమించుకున్నారట.

జయభేరిలో గురువుగారిలా నాగయ్యగారు గురుస్థానంలో కూర్చుంటే తన గురువుగారు పట్రాయని సీతారామశాస్త్రిగారు కూర్చున్నట్లుగా భావించి నాగేశ్వరరావు క్యారెక్టర్ నేనులాగా అనుకుని పాడాను అనేవారుట. నాకు చాలా తృప్తినిచ్చాయి ఈ చిత్రంలో పాటలు అనేవారుట మాష్టారు.

## పెండాల్య గారి స్వరంలో ఘంటసాల గారి గళం

పెండ్యాలగారు స్వరపరచగా ఘంటసాల గారి గళం నుండి వెలువడిన కొన్ని ఆణిముత్యాలు : పెండ్యాల గారి మొదటి చిత్రం 'ద్రోహి' లోనే ఘంటసాల గారు జి.వరలక్ష్మితో "మొదటిరాత్రి మనోవాంఛలు", "పూలు చేరి పలమారు తిరుగుచూ" జి. వరలక్ష్మితో జి.వి.రావు పాట పాడారు. తరువాత 'దీక్ష కన్నతల్లి'లో "ఎంత మంచిదానవమ్మా'', 'దొంగరాముడు'లో ''చిగురాకులలో చిలకమ్మ'', 'బావామరదళ్ళు'లో "ముక్కోటి దేవతలు పయనించే మనవలపుల", "హృదయమా, ఓ బేల హృదయమా", "నీలిమేఘాలలో", 'ముద్దుబిడ్డ', 'అక్కాచెల్లెళ్ళు', 'యం.ఎల్.ఎ.', 'భాగ్యరేఖ', 'కృష్ణప్రేమ', 'భాగ్యచక్రం', 'ఉమాఛండీ', 'ఆంధ్రమహావిష్ణువు కథ' ఇత్యాది చిత్రాలలో ఘంటసాలగారు పాడి చిత్రాల విజయానికి దోహదపడ్డారు.

వేళ్ళతో లెక్కపెట్టగల చిత్రాలు. మొదటి పదిలో మొదటిది : 'జయభేరి' – ప్రతిభాశాస్త్రి, వాసిరెడ్డి గార్ల చిత్రం : విజయానంద రామరాజును కీర్తిస్తూ గాయకుడు కాశీనాథ్‌శాస్త్రి పాడే పాట ఆరోహణలో ఒక రాగచ్ఛాయ, అవరోహణలో మరొక రాగచ్ఛాయతో ఉత్తరాది రాగాలైన భైరవ్ బహార్లకు ప్రతిబింబాలైన చక్రవాక కానడ రాగలలో ఒక పాట స్వరపరచారు. దానికి కవి మల్లాది రామకృష్ణ శాస్త్రి గారు అనురాగంతో "విజయానందచంద్రిక" ని నామకరణం చేశారు. అదే "రసికరాజ తగువారము కామా" ఈ పాట ఘంటసాలగారు పామర్తితో కలిసి ఇరవై రోజులు సాధన చేసి ఒక టేకులోనే పాడారుట. ఇటువంటి పాట తనకు రాలేదని, ఇంటిలో రికార్డింగ్ జరగలేదని బాధపడేవారుట.

ఇంకా ఈ జయభేరిలో మారుమ్రోగిన ఘంటసాల గారి పాటలు, మదిశారదాదేవి మందరమే, రాగమయీ రావే అనురాగమయీ రావే, యమునాతీరమున సంధ్యా సమయమున, నందుని చరితము వినుమా, నీదాననన్నదిరా నిన్నే కోరుకున్నదిరా".

రెండవది : జగదేకవీరునా కథ : దర్శకుడు కదిరి వెంకట రెడ్డి "ఈ ఘట్టంలో నాయకుని గానానికి శిల కరిగిపోవలసి వుంది. మీరెలా కడతారో మంచి పాట స్వరపరచాలి అంటే చివరికి ధర్బారీ కానడ, ఘూర్జరీ తోడి, శంకరరాగాలలో పాడి వినిపించారుట. కె.వి.కి. దర్బారీ కానడ నచ్చిందట. అదే రాగంలో రాగాలాపన, స్వరప్రస్తారం, పల్లవి, అనుపల్లవి, చరణం, నెరవు, తానం, ఇత్యాది లక్షణ లక్షితమైన "శివశంకరీ శివానందలహరి" పాట రూపొందింది. శిల కరిగిపోయింది ఘంటసాల గారి గానంతో. ఈ పాటకు ఘంటసాలగారు విశేషంగా సాధన చేసి ఒక్క టేకులో పాడారంటారు. ఈ చిత్రంలో నాలుగు యుగళగీతాలు, నాలుగు సోలోలు పద్యాలతో ఘంటసారి గారి కీర్తి తారస్థాయికి వెళ్ళింది. కృష్ణుని మీద వచ్చిన చిత్రాలు పెండ్యాల గారు చాలావాటికి స్వరపరచారు.

మూడవది : శ్రీకృష్ణార్జునయుద్ధం. దీనిలో కృష్ణుడికి, అర్జునునికీ, నారదుడికి, గయుడికి ఇలా అందరికి వైవిధ్యమైన రీతిలో పాటలు పద్యాలు పాడారు ఘంటసాల గారు.

4. మహామంత్రి తిమ్మరుసులో మోహనరాగ మహా, జయవాణి, తెలుగు ప్రభువు పాటలు...

5. శ్రీ వెంకటేశ్వర మహాత్మ్యం – కలియుగదైవం ఎదురుగా అన్నమయ్య కూర్చుని పాడాన పాట "శేషశైలవాసా శ్రీ వేంకటేశ", ఘంటసాలగారు టి.టి.డి. ఆస్థాన గాయకుడైన తరువాత అక్కడే కూర్చుని పాడేవారు. ఇంకా రెండు యుగళగీతాలు, ఏకగళాలు.

6. మహాకవి కాళిదాసు : ఈ చిత్రంలోని పాటలు, పద్యాలు అజరామరం.

7. శ్రీకృష్ణతులాభారం : నారదునికి, శ్రీకృష్ణునికి పాటలు, పద్యాలు. ఓహో మోహనరూపా, భలే మంచి భేరం, ఓ చెలి కోపమా అంతలో తాపమా.

8. శ్రీకృష్ణవిజయం : నారదునికి, శ్రీకృష్ణుని పాటలు, పద్యాలు, కుచేలునికి "నా జీవితమే నీకంకితమ.

9. రాముడు–భీముడులో నాలుగు యుగళాలు, డ్రామాలు, ఆసక్తికరమైన పాటలున్నాయి.

10. వాగ్దానంలో హాస్య (కేరెక్టర్) నటుడు రేలంగికి శ్రీరామ హరికథ, వెలుగు చూపవయ్యా, నాయకునికీ వన్నె చిన్నెలన్ని ఉన్న చిన్నదానివే, నా కంటిపాపలో యుగళం, కాశీపట్టణం చూడరబాబు.

అనుసమా వారి కే.బి.జి. తిలక్‌కి ఆరుద్ర కుడిభుజం పెండ్యాల ఎడమ భుజమైతే ఘంటసాల గారు గుండెగా వారి అనేక చిత్రాలు ముద్దుబిడ్డా, ఆలుమగలు, ఈడుజోడు, అత్తా ఒకింటి కోడలే, ఉయ్యాల జంపాల, భూమి కోసం, పంతాలు పట్టింపులు, యం.యల్.ఏ. వంటి అనేక చిత్రాలకు లెక్కలేనన్ని పాటలు ఘంటసాల గారు పాడారు.

భక్తశబరిలో "మోము చూడ వేడుక". పెండ్యాల గారు స్వరపరచిన మహామంత్రి తిమ్మరుసు, మహాకవి కాళిదాసుకు ప్రభుత్వ రజత పథకాలు అందాయి. వీరు అనేక చలనచిత్ర నిర్మాణ సంస్థలకు ఆస్థాన సంగీత దర్శకునిగా చేశారు.

1974లో ఘంటసాల గారు సంగీతం కూర్చిన "సతీ సావిత్రి"కి ఘంటసాల గారి అనారోగ్యం, మరణం కారణంగా పెండ్యాల గారు స్వరపరచి రికార్డింగ్ చేశారుట. ఇలాగే 50 దశకంలో వచ్చిన అక్కినేని, యస్.వరలక్ష్మి నటించిన సతీసావిత్రి కూడా పెండ్యాల స్వరపరచారు. ఈ వారం సంగీత దర్శకుడు పెండ్యాల నాగేశ్వరరావు ఆరాధకుల ఆరాధ్యదైవం ఘంటసాల వెంకటేశ్వరరావు గారికి స్వర నివాళులతో...

**– గుదిమెళ్ళ సుదర్శనాచార్యులు**



# శ్రీ.వి. రావ్ పేజీ

(గోటేటి వేంకటేశ్వరరావు)

## శారీరకంగా కాని, మానసికంగా కాని, నైతికంగా కాని లేక ఆధ్యాత్మికంగా కాని బలహీనుడవు కాబోకు.

- స్వామి వివేకానంద



పైన ఉదహరించిన వివేకానందుని సూర్తి నాకు బాగా నచ్చిన సూక్తి. పైగా పై లక్షణాలన్నీ మా నాన్నగారు నాకు ఆచరించి చూపినవి. నేను చదువుకున్నది శ్రీరామకృష్ణ బాలుర ఉన్నత పాఠశాలలో అందువల్లనే ఏమో స్వామి వివేకానంద పట్ల ఆకర్షితుడనై ఆయన సూక్తులను జీర్ణించుకుని కొన్నిటిని నా జీవితంలో ఆచరిస్తున్నాను. సరే ఈ ఉపోద్ఘాతమంతా ఎందుకంటారా?

ప్రస్తుతం ప్రపంచాన్నంతా అతలాకుతలంగా కుదిపేస్తున్న కరోనా మహమ్మారి బారిన నేను పడ్డాను. అవును ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నా ఎదుటివాడి అలసత్వం అజాగ్రత్త కూడా మనకు ఒక్కోసారి శాపంగా పరిణమిస్తుంది.

ప్రభుత్వ సూచనలు సలహాలు పాటిస్తూన్నాను. లాక్‌డౌన్ ప్రకటించినప్పుడల్లా ఆ నిబంధనలను పాటిస్తూ, సామాజిక దూరాన్ని పాటిస్తూనే వున్నాను. మా ప్రెస్ లాక్‌డౌన్ సడలింపులలో తెరచినప్పుడు తగు జాగ్రత్తలు తీసుకుంటూనే వున్నాను. అయినా ఎలా వచ్చిందో నాదగ్గరికొచ్చేసింది ఈ కరోనా (నేను పాజిటివ్ మనిషిని కాబట్టి వచ్చిందేమో). నాకు కాస్త అనుమానం వచ్చాక తిన్నగా రోగ లక్షణాలను వివరిస్తూ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్ళాను (ఓమందూర్ మల్టీస్పెషాలిటీ హస్పిటల్) అక్కడ స్వాప్ టెస్ట్, ఎక్స్‌రే, స్కాన్ వగైరాలు అయ్యాక లంగ్‌లో మైల్డ్ ఇన్‌ఫెక్షన్ వుందని, నా వయసురీత్యా అడ్మిట్ అవ్వాలని చెప్పారు. ఆలస్యం చెయ్యకుండా వారు చెప్పినట్లుగానే అడ్మిట్ అయ్యాను. ప్రభుత్వ ఆసుపత్రి కదా అని ఒకసారి తటాపటాయించి చూద్దాం అనుకుంటూ అడ్మిట్ ఐపోయాను. అడ్మిషన్ ఫారంలో నా అడ్రస్ వివరాలు, ఇంటిలో ఎంతమంది వున్నారు, ఆఫీస్ అక్కడి వివరాలు అన్నీ కూడా అడిగి తీసుకున్నారు. అన్ని వివరాలు సెల్‌ఫోన్ నంబర్లతో సహా ఇచ్చేసాను. రెండు రోజుల అనంతరం కార్పొరేషన్ అధికారుల హడావిడిగా ఇంటికెళ్ళి, ఇంటిల్లపాది అద్దెకున్నవారితో సహా టెస్టులు చేశారు. కాని భగవదనుగ్రహం వల్ల అందరికి నెగటివ్ రిజల్ట్ వచ్చింది. అలాగే మా ప్రెస్‌లో కూడా. కాని నావల్ల ఎవరికి అంటుకోలేదని తెలిసాక నాకు కాస్త తృప్తిగా అనిపించింది.

అవును ఈ కరోనా కొన్ని పాఠాలు నేర్పింది. నేను దరిదాపుగా ఆసుపత్రిలో 8 రోజులు వున్నాను. ఈ ఎనిమిది రోజులు నాచుట్టూ జరిగిన సంఘటనలు, మనుషులు, వారి ఆలోచనా విధానాలు, ఇవన్నీ గమనించి జీవితం దాని విలువ, ఆ జీవితం పట్ల ఒక్కొక్కరికి ఉన్న అవగాహన, మన ఆరోగ్యం, ప్రాణం మీదికి వచ్చాక మనలోని భయాందోళనలు గమనించాను. కరోనా పాజిటివ్ అయిన నేను ఆసుపత్రిలోని 8 రోజులు కొన్ని విషయాలు నేర్చుకున్నాను. సరిగ్గా అప్పుడే ఈ వివేకానందుని సూక్తి "శారీరకంగా గాని, మానసికంగాగాని, నైతికంగా కాని, లేక ఆధ్యాత్మికంగా కాని బలహీనుడవు కాబోకు – దీనిని అక్షరాలా పాటించాను. ఇప్పుడే కాదు ఇది నేను నా జీవితంలో ఎప్పుడూ పాటించాను. పాటిస్తాను కూడా. అవును ఎన్నో ఆటుపోట్లను ఒడిదుడుకులను తట్టుకునే నా జీవనప్రయాణం సాగింది. మా నాన్నగారు నాకు గురువు. ఆయన చూపిన జీవితం, ఆయన తట్టుకున్న ఒడిదుడుకులముందు నావి పెద్ద లెక్కలోకి రావు. కాని ఎప్పుడు డీలాపడిపోలేదు. నేను నమ్ముకున్న భగవంతుడు నన్ను కాదనడనే అపారమైన దైవనమ్మకం కలవాడిని. 2015 వరదలలో మొత్తం అంతా ఊడ్చిపెట్టుకుని పోయి వీధిలో నిలబడ్డ పరిస్థితి వచ్చినప్పుడు కూడా మానసికంగా కాని, శారీరకంగా కాని కృంగిపోలేదు. ఎప్పుడు ధర్మాన్ని అంటిపెట్టుకుని వ్యాపారం చేసాను కాబట్టి నైతికంగా ధర్మం కాపాడుతుందని నమ్మకం ఉన్నవాడిని.

ఇక ప్రస్తుత విషయానికి వస్తే ఈ కరోనా ఎక్కడినుంచి వచ్చింది, ఎలా వస్తోంది, ఏవి చేస్తోంది నిజంగానే ఇది భయంకరమైన వ్యాధేనా. వీటన్నిటికి సమాధానాలు అవుననే అనిపిస్తున్నాయి. ఈ కరోనా వల్ల మొత్తం ప్రపంచం అల్లకల్లోలమైపోయింది. సంక్షోభంలో కూరుకుపోయింది. అగ్రరాజ్యాల నుండి అతిచిన్న రాజ్యాల వరకూ కుదేలైపోయాయి. ఇంతటి విశాల ప్రపంచంలో ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, వాతావరణపరంగా, జీవనశైలిలో, ఆహారపు అలవాట్లలో ఒక దేశానికి ఇంకో దేశానికి చాలా వ్యత్యాసం వుంది. ఇన్ని వ్యత్యాసాలు వున్న మొత్తం ప్రపంచం ఈ కరోనా విషవలయంలో చిక్కుకుపోయింది. చంద్రమండలం మీద కాలుపెట్టిన మానవుడికి ఈ కరోనాకు మందు కనిపెట్టె మేధాశక్తి లేకపోయింది. మానవుడు ఛేదించలేని వలయంలో చిక్కుకుపోయినట్టు వుంది. ఈ వ్యాధికన్నా భయంకరమైన వ్యాధులు చాలా వున్నాయి. ఇంకా మందు కనుక్కోలేని వ్యాధులు చాలా వున్నాయి. అయినా ఈ కరోనా చేసిన భీభత్సం అంతా ఇంతా కాదు. ఎంత తొందరగా వ్యాపించిపోకుండా జనం అంతా కొందరు బయటికి వచ్చేస్తున్నారు. ఎంతో భయం సృష్టించినా మరణించిన వారి సంఖ్య చూస్తూంటే పది శాతం కన్నా కూడా తక్కువగానే వున్నారు. మరెందుకి భయం. మనకు తెలిసో, తెలియకుండానే మనం సృష్టించుకున్న పద్మవ్యూహంలో మనం చిక్కుకుపోయాం. దానినుండి బయటికి రాలేక తికమకపడుతున్నాం. ఇది వాస్తవం.

ఇక ఆస్పత్రిలో గడిచిన 8 రోజులలోనూ రకరకాల మానసిక పరిస్థితులలో మనుషులను చూసాను. నేనున్నది 12 బెడ్లు ఉన్న వార్డ్. అందరు 55 సంవత్సరాల నుండి 80 సంవత్సరాల వయసున్నవారు. కాస్త సీరియస్ పేషంట్స్ అంటే ఆక్సిజన్‌లు, డ్రిప్స్ ఎక్కించుకునేవారే. కొందరు స్పృహలోనే లేరు. కొందరు అంతా అయిపోయింది, ఇంకేమీ మిగలలేదు అనుకునేవారు. అబ్బే ఇదేమీ కాదు రేపో ఎల్లుండో ఇంటికెళ్ళిపోదాం అనుకునే నాలాంటివారు ఇద్దరు ముగ్గురున్నారు. కరెక్టుగా ఈ ముగ్గురు వారం రోజుల్లో ఇంటికొచ్చేసాం. స్పృహలో లేనివారుగా ఒక ముగ్గురు లోకాన్ని విడిచి వెళ్ళారు. సీరియస్ మనుషులు ఇంకా సీరియస్‌గానే వున్నారు.

మనం ఏవి కోరుకుంటామో అదే జరుగుతుంది అంటారు. అవును నేను అడ్మిట్ అయిన ఆ వార్డులో ఒక జంట వున్నారు. ఆయన 82 ఏళ్ళు డాక్టర్ ఆవిడకు 78 ఏళ్ళు. వాళ్ళిద్దరికి మధ్య నా బెడ్. ఆవిడ అమ్మో, అయ్యో అంటూ అరుస్తూనే వుండేవారు, మనవడు వచ్చి ధైర్యం చెపుతూ వుండేవాడు. డాక్టర్లు వచ్చినప్పుడు ఒక్కొక్కరి దగ్గరకి వచ్చి పలకరించి ఎలా వున్నారు అని అడుగుతూ వుంటే ఆ పెద్దావిడ నాకు చావు కావాలి అన్నారు. తప్పు అలా అనకూడదు అంటూ వుంటారు. కాని ఆవిడే గెలిచింది. ఆవిడ ఏవి కోరుకున్నదో అదే మరణం ఆవిడకు సంభవించింది. కరోనా పాజిటివ్ అయినందువల్ల కార్పొరేషన్ సిబ్బంది శవాన్ని తీసుకుని వెళ్ళిపోయారు. అదే వార్డులో ఇంచుమించు అదే వయస్సు పెద్దావిడ మొత్తం వార్డుకి ఈవిడ సీరియస్ పేషెంట్, ఆవిడ ఇంటికెళ్ళాలని కోరుకున్నది. కాని విచిత్రమేమంటే ఆవిడకు మరణం సంభవించింది. కాని ముందురోజు టెస్ట్‌లో నెగటివ్ వచ్చినందువల్ల ఆవిడను వారి వారికి అందజేశారు. అందుకే పెద్దలంటారు మనమేమి కోరుకుంటామో అవే జరుగుతుందని. ఎవరైనా ఇలాంటి మాటలు మాట్లాడినప్పుడు అపశకునంగా మాట్లాడవద్దని మందలిస్తూ వుంటారు.

ఆ రెండు మరణాలు తప్ప మిగిలినవారందరు అక్కడ నుండి బయటపడ్డవారే. కాబట్టి, ప్రభుత్వం చెపుతున్నట్లు మరణాలు తక్కువ అన్నది వాస్తవము. ఎక్కువగా గుండెజబ్బు, ఊపిరితిత్తుల వ్యాధి, ఆస్మా వున్నవారికే చాలా ఇబ్బంది కరంగా వుంటోంది. ధైర్యం సడలనివారు ఎన్నో వ్యాధులున్నా బయటపడ్డవారు వున్నారు. కాని ఏ వ్యాధి లేకుండా భయపడిపోయినవారు తిరిగి వెళ్ళనివారు ఉన్నారు. మొత్తానికి ఈ వ్యాధి మనల్ని మానసికంగా కృంగదీయాలని చూస్తోంది. కాని మనం లొంగకుండా వుంటే బయటపడ్డట్లే.

ఇంక అక్కడి సిబ్బంది గురించి మాట్లాడాలంటే అందరు 25 నుంచి 40 ఏళ్ళలోపు వారే ఎక్కువగా. వారు సేవాభావంతోనే పనిచేసారు. ఆ వ్యాధి సర్వవ్యాపి అని తెలిసినా ఏ భయం జంకు లేకుండా ధైర్యం చెపుతూ ప్రతి గంట గంటకి వచ్చి పలకరిస్తూ వారిచ్చే మందులతో పాటు మనకు ధైర్యాన్ని నూరి పోస్తూ తగు జాగ్రత్తలు తీసుకుంటూ వారి కర్తవ్యాన్ని నవ్వుతూ నిర్వహిస్తున్నారు. నాలో ప్రభుత్వ ఆసుపత్రి అంటూ ఉన్న అపోహ పోయింది. ఇలా సేవాభావం వున్నవారే మనకు కావాలి. వారే ఈ దేశ ప్రగతికి కారకులు. జవానులు ఎంత ముఖ్యమో, మన ఆరోగ్యాన్ని కాపాడేవారు ముఖ్యం. ఆహారపు అలవాట్లు, యోగ, ప్రాణామాయం, చాలా తక్కువ మందులతోనే నేను బయటపడ్డాను. అవును నేను హాస్పిటల్‌లో పాటించినదిదే. ఇదే ఇక కంటిన్యూ అవ్వాలి. మీకెవరికైనా దీనిపై అవగాహన కావాలనిపిస్తే నన్ను సంప్రదించండి. మీకు నా సలహా సూచనలు ఉపయోగపడతాయనిపిస్తే నేను తప్పకుండా మీకు ధైర్యాన్ని ఇవ్వగలను.

* * *

## పరోపకారమే పుణ్యము



అష్టాదశ పురాణేషు వ్యాసస్య వచనం ద్వయమ్ పరోపకారః పుణ్యాయ పాపాయ పరపీడనమ్ – అష్టాదశ పురాణాల ప్రాముఖ్యాన్ని వ్యాసుడు ఈ రెండు మాటలలో చెప్పాడు పరోపకారమే పుణ్యము, పరపీడనమే పాపము. అలాగే సత్యసాయీశ్వరుడు Help Ever Hurt Never అంటారు. అందరికీ సహాయం చెయ్యాలి. ఎవ్వరిని బాధపెట్టకూడదు.

మనం పోయిన నెల సోనూసూద్ గురించి చెప్పుకున్నాం. ఈ నెల మరో విశిష్ట వ్యక్తి గురించి విందాం. మనందరికి ఎప్పుడు వాట్సాప్ గ్రూపుల నుంచి రక్తదానం కావాలని, లేమి, ఆర్థికంగా సాయం కావాలని, చదువుకు సహాయం చేయాలని మేసెజ్‌లు వస్తూ వుంటాయి. నాకు అలాంటివి బోలెడు వస్తాయి. వాటిలో నాకు సహాయం చెయ్యాలనుకున్నవాటిని క్షుణ్ణంగా పరిశీలించి ఫోన్ ద్వారా ఎంక్వయరీ చేసి వీలుంటే నేనో లేక నలుగురు స్నేహితులను కలుపుకుని, సహాయం చేస్తుంటాను. అలాగా ఈమధ్య ఒక మెసెజ్ చూసాను. విషయం కనుక్కుని నేను మరికొంతమందిని పోగుచేసి సహాయం చేద్దామనుకునేలోపు చాలా థ్యాంక్సండి సహాయం అందింది. ఒకాయన సహాయం చేసారు అని చెప్పారు. పోనీలే మంచి జరుగుతుందనుకుని కుతూహలం పట్టలేక ఎవరా మహానుభావుడు అని వాకబు చేస్తే, ఒక టీ అమ్ముకునే కుర్రవాడు అంతా మొత్తాన్ని తను ఒక్కడే చేసాడని తెలిసింది. ఇదిగో అతని వివరాలు :

"ఓ వ్యక్తి దగ్గరకు ఒక ఆమె వచ్చి సర్ నా భర్త చనిపోయాడు. నాకు ఇద్దరు పిల్లలు. ఇన్నిరోజులు నేను నాలుగిళ్ళల్లో పనిచేస్తూ నా జీవనం సాగించాను. ఇప్పుడు కరోనా కాలం కావడంతో నన్ను పని మాన్పించారు. నాకు జీవనం పోయింది ఎలాగైనా నాకు ఒక కుట్టుమిషన్ ఇప్పించగలిగితే నేను నా జీవనం సాగిస్తానని చెప్పింది. అతను అదే విషయాన్నీ సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా, ఒక వ్యక్తి నుండి ఫోన్ వచ్చింది. వారు నిజంగానే సహాయం పొందడానికి అర్హురాలేనా అని అడిగారు. అవునండి అని సమాధానం చెప్పడంతో సరే నేను కుట్టుమిషన్ తీసిస్తాను, మీ నెంబర్‌కు డబ్బులు పంపిస్తాను అని చెప్పాడు. వద్దు సర్ మీరు ఆ కుట్టుమిషన్ ఉన్న షాప్ యజమానికి డబ్బులు ట్రాన్సఫర్ చేయండి అని అతని నెంబర్ ఇచ్చాడు. చిన్న ఆటో మాట్లాడుకుని వెళ్ళి కుట్టుమిషన్ తీసుకుని వారికి ఆ మిషన్‌కు సంబంధించి దారాలు సూది ఇతర అవసరమైన వస్తువులతో పాటు నెలకు సరిపడే సరుకులు తీసుకుని వెళ్ళి ఆమె ఇంటి ముందు ఆగగా ఆమె ఆశ్చర్యపోయి కనీళ్ళు పెట్టుకుంది. ఆమెకు సాయం చేసిన వ్యక్తిని చూపించడం కోసం వాట్సాప్ వీడియో కాల్ చేయగా అవతలి వ్యక్తిని చూసి ఆశ్చర్యం. ఒక ప్రభుత్వ ఉద్యోగి లేదా బాగా సెటిల్ అయిన వ్యక్తి అయిఉంటాడని అనుకున్న అందరికి ఆశ్చర్యం. అతను 25 ఏళ్ళ పిల్లాడు ఒక సైకిల్ పైన వీధి వీధి తిరుగుతూ టీ అమ్ముతున్నాడు. అతని యజమాని ఎవరైనా సాయం చేస్తున్నారేమో అని వెతికాడు ఎవరూ లేరు. ఇప్పుడు అతడి గురించి ఆరా తీయాలనే ఆలోచన పెరిగింది. చిన్న తనంలోనే తల్లితండ్రిని పోగొట్టుకుని ఆకలి బాధను అనుభవించాడు. పుట్టిన ఊరు వదిలి వచ్చాడు నా అనేవాళ్ళు లేకపోవడంతో ఇలా కష్టపడి పనిచేస్తూ, ప్రతిరోజు అతను 20 మందికి ఆకలి తీర్చడం మొదలుపెట్టాడు. ఇతడి గురించి తెలుసుకున్న ఎంతోమంది సహాయం చేయ ముందుకు వచ్చి డబ్బులు ఇస్తామని చెప్పినా సున్నితంగా తిరస్కరించి ఆ సహాయాలను నిజంగా అర్హులైన వారికి వారిచేత ఇప్పిస్తుంటాడు. అతడి ఆలోచనకు సలాం. అతడి నిస్వార్థపు సేవకు నమస్కరిస్తున్నా. కష్టం తెలిసినవాడు ఆ కష్టాన్ని తీర్చాలని ముందుకు వచ్చాడు నిజంగా నిజాయితీగా కష్టపడేవాళ్ళకు దేవుడు ఎప్పుడూ తోడు ఉంటాడు. సాయం చేసే మనసు ఉండాలికాని ధనిక పేద చిన్న పెద్ద అనే తారతమ్యం లేదు."

* * *

## మహానుభావుడు

ఇతను పేరు పూల్ పాండ్యన్, నివాసం మధుర, నివాసస్థలం మదురై వీధులు, వృత్తి యాచకం. గత 3 నెలలుగా ఈ కరోనా వ్యాధి బారిన పడినవారిని చూసి అతని మనస్సు చలించింది. హృదయం ద్రవించింది. అందుకనే మదురై గుడులు, వాటి సమీప వీధుల్లో యాచకం చేసుకునే ఈ పూల్ పాండ్యన్ 90 వేల రూపాయలు అవును నిజమే తొమ్మిది దఫాలుగా 10,000 రూపాయల చొప్పున 9 సార్లు 90,000 రూపాయలు తమిళనాడు ముఖ్యమంత్రి కరోనా నిధికి విరాళమిచ్చాడు. ఇతని సేవను గుర్తించి మొన్నటి ఆగస్ట్ 15 విశిష్ట వ్యక్తులను గౌరవించే సత్కారంలో ఇతని పేరు 5వ వ్యక్తిగా వున్నది. కాని సరైన అడ్రస్, ఇతర వివరాలు సెక్యూరిటీ సిబ్బందికి అందించలేనందువల్ల ఆ సభలో



పాల్గొనలేకపోయాడు. కాని వివరాలన్నిటిని తెలుసుకున్న మదురై కలెక్టర్ పూల్ పాణ్యడన్‌ను తన కార్యాలయానికి ఆహ్వానించి ఆ సత్కారాన్ని ఆయన చేతుల మీదుగా జరిపారుట. ప్రభుత్వాలు, పెద్ద సంస్థలు, పేరు ప్రఖ్యాతులున్నవారు అయితే ఈపాటికి వారికి ఎంత ప్రచారం వచ్చేదో కాని తనకే లేక యాచక వృత్తిలో వున్న ఈ “మహానుభావుడు” చేసిన ఈ సత్కార్యానికి మన ప్రముఖాంధ్ర ద్వారా మీ అందరికి తెలియపరచాలనే తాపత్రయంతోనే ఈ వార్త మీకందిస్తున్నాను.

* * *

## విలువైన వ్యక్తిత్వం

మా అత్తగారు శ్రీమతి లక్ష్మీకాంతమ్మ గారు సెప్టెంబరు 2న పరమపదించారు. ఆవిడ వయస్సు 96 సంవత్సరాలు. ఆ 96 సంవత్సరాల వయస్సులో ఎవరిని ఏ ఇబ్బంది పెట్టకుండా వెళ్ళిపోయారు. అంతకుముందు ఒక వారం రోజులుగా ఇక బయలుదేరేవేళ వచ్చింది. ఇక నేనుండను అంటూ వుండేవారు. నాకు పెళ్ళయి దరిదాపుగా 32 ఏళ్ళు. నా పెళ్ళికి మా మావగారు లేరు. ఈ 32 ఏళ్ళలో నేను చూసినవరకు మా అత్తగారు కుటుంబాన్నంతా ఒక త్రాటిపై నడిపారు. మా గోటేటి కుటుంబంలాగా వారిది ఉమ్మడి కుటుంబమే మా అత్తగారి ఇంటికి నాలుగిళ్ళ అవతల మా పిన మామగారి ఇల్లు. మా మావగారు చిన్నవయస్సులోనే పోయారు. ఇక్కడ మావగారి ఇంట్లో 2 అబ్బాయిలు 3 అమ్మాయిలు. అక్కడ పినమామగారింట్లో 2 అమ్మాయిలు 4 అబ్బాయిలు అందరూ ఒకేచోట ఉమ్మడి కుటుంబం. ఈ 11 జంటలకు తన సలహాలను సూచనలను ఇస్తూ మా అత్తగారు చాలా హుందాగా నడుచుకునేవారు.

ఈ జంటలు అంతే గౌరవాన్ని ఆవిడకు ఇస్తూ వుండేవారు. మా పిన్నత్త గారు చిన్న వయస్సులోనే పోయారు. మా పినమామగారు పోయి దరిదాపుగా 25 ఏళ్ళకు పైనే. ఈ 25 సంవత్సరాలు ఈ 11 కుటుంబాలలో దరిదాపుగా



పెళ్ళిళ్ళు. శుభకార్యాలు అన్నీ ఆవిడ చేతులమీదుగానే జరిగాయి. ఈ 96 ఏళ్ళ వయస్సులోను ఆవిడ అభ్యుదయ భావాలు కలబోసిన సాంప్రదాయాలు విడవని మనస్తత్వం. ఏది ఎవరికి ఇష్టమో గుర్తెరిగి వారు మనస్సు నొచ్చుకోకుండా సలహాలనిచ్చేవారు. ఈ 11 కుటుంబాలలో కాకుండా వారి కోడళ్ళు, అల్లుళ్ళ కుటుంబాల వారు కూడా ఆవిడకు గౌరవాన్నిచ్చేవారు. అంతటి హుందాతనం కలవారు. ఈ 33 ఏళ్ళలో నేను ఆవిడతో మాట్లాడినది చాలా తక్కువే. కాని నాకావిడ పట్ల చాలా గౌరవముండేది. నేనీమధ్య కరోనా బారినపడి ఆసుపత్రి పాలైనప్పుడు మా అత్తగారు బాధపడ్డారని విన్నాను. ఇంటికొచ్చాక వెళ్ళి కనిపించాలనుకున్నాను. కాని ఇంతలోనే ఇలా జరుగుతుందని ఊహించలేదు. వయస్సు 96 అయినా అమ్మ అమ్మేకదా. ఈ రెండిళ్ళ అన్నదమ్ముల 11 కుటుంబాలలోని 11వ పిల్ల మా ఆవిడ లలిత. అంటే అందరికన్నా చిన్న. మా అత్తగారు కొడుకులు, కోడళ్ళు, కూతుర్లు, అల్లుళ్ళు, మనవలు, మనవరాళ్ళు, మునిమనవలు, ముని మనవరాళ్ళు చూసిన ఆవిడ, అందరిని తన చివరి శ్వాస వరకూ పేరుతో సహా ఆవిడకు గుర్తు. ఫోన్ చేస్తే పేరుపేరునా అడిగేవారు అలా అందరిచేత గౌరవింపబడ్డ వ్యక్తిత్వం శ్రీమతి లక్ష్మీకాంతమ్మ గారిది. ఆవిడ నిర్యాణంతో ఒక తరం వెళ్ళిపోయింది. కాని ఆవిడ ఆశీస్సులందరికి ఉంటాయి




SRI RAJARAJESWARI JEWELLERY

The Oldest Jewellery Shop in Pondy Bazaar

81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.

Phones : 28152387, 28154653

*The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation*



అతులిత పుష్ప పల్లవ ఫలాన్విత
భూరుహ భూరివల్లరీ
- మన మాతృభాష ఔన్నత్యం అభివ్యక్తీకరించడం,
ప్రతీ ఉషస్సున లేవగానే
పాఠకులపై భారం వేయరాదని,
ఆరాధించడమనే తపనం, తపస్సు!
అర్థ, వృద్ధ భారాన్ని మోస్తూనే
అఆ
308 నెలలుగా
308 సంచికలను
శ్రీ వేంకటేశ చరణౌ చరణం ప్రపద్యే।
ప్రముఖాంధ్ర
- వెలువరించ కలిగిదందంటే ఏడుకొండల ఱేడు కృప! వాగ్దేవి యిచ్చిన శక్తి!
'ప్రముఖాంధ్ర' వెబ్ ఎడిషన్ చూచినవారు
పాత పత్రికలను చూచినవారూ 'ప్రముఖాంధ్ర' కోరుతున్నారు.
కోరినవారందరికీ పంపాలనే ఉన్నది.
ధనసంపత్తి కలవారూ, మన సంపత్తి కలవారూ
ప్రముఖాంధ్ర నిధికి యధోచితంగా సహకరించండి.
రు.10000లు మించి పంపించిన ప్రదాతల పేర్లను
వారి ఫోటోలతో ప్రచురిస్తాం.
(ఉడతా భక్తిగా చిన్న విరాళములనూ పంపవచ్చు)
గోటేటి శ్రీరామారావు
స్థాపక సంపాదకుడు
చిరునామా:
16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 600 033.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com

Date of Publication - 3rd of every month
PRAMUKHANDHRA
September 2020

REGN. No. TN/CC(S)DN/177/18-20
Licensed to Post without Prepayment. WPP No. TN/PMG(CCR)WPP-656/15-17
Registered with Registrar of Newspapers for India RNI No. 67369/97

